

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 21-12-2025 | సంపుటి - 26 | సంచిక -213 | రూ : 4 | పేజీలు: 8


## ఇతర మతాలను..
# కించపరిస్తే కఠిన చర్యలు..



2లో

- ఆ చట్టం తీసుకువస్తాం: సీఎం రేవంత్ రెడ్డి
- ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న రేవంత్ రెడ్డి
- డిసెంబర్ నెల కాంగ్రెస్ పార్టీకి ఎంతో కీలకమన్న ముఖ్యమంత్రి
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో హేట్ రేట్ చట్టం తీసుకువస్తామని వెల్లడి

# బెంగాల్‌లో ప్రతికూల వాతావరణం..
## వెనక్కి తిరిగి వచ్చిన మోదీ హెలికాప్టర్

- వాతావరణం అనుకూలించకపోవడంతో తాహెర్‌పూర్‌లో దిగలేకపోయిన హెలికాప్టర్
- కాసేపు అక్కడే చక్కర్లు కొట్టి కోల్‌కతాకు తిరిగి వచ్చిన హెలికాప్టర్
- నాడియా జిల్లా కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని మోదీ



2లో



2లో

## తాజ్ మహల్ ను కమ్మేసిన
## పొగమంచు.. టూరిస్టుల నిరాశ

- వ్యూ పాయింట్ నుంచి అస్సలు కనిపించని తాజ్
- సోషల్ మీడియాలో వైరల్ గా మారిన వీడియో
- తాజ్ ఎక్కడుందంటూ కామెంట్లు పెడుతున్న యూజర్లు

## పాలనకు భూ బకాసురులు
# అడ్డంకులు సృష్టిస్తున్నారు

- మెగా డీఎస్సీ, కానిస్టేబుల్ నోటిఫికేషన్లపై కేసులు వేశారని చంద్రబాబు ఆగ్రహం
- ఐటీ కంపెనీలు వస్తున్నా అడ్డుకుంటున్నారని వ్యాఖ్య
- మెడికల్ కాలేజీలను మేనేజ్‌మెంట్‌కు ఇచ్చాం, ప్రైవేట్‌కు కాదని స్పష్టీకరణ



2లో

## భారతీయ ప్రాచీన జ్ఞానంతో ప్రపంచ సమస్యల పరిష్కారం

- బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ 21వ వార్షికోత్సవంలో రాష్ట్రపతి ముర్ము



2లో




## పీఎస్సీలకు
# నిష్పాక్షికతే పునాది...

2లో

- అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదు
- వికసిత్, ఆత్మనిర్భర్ భారత్ ప్రయాణంలో మీదే కీలకపాత్ర
- ఛైర్‌పర్సన్ల సదస్సులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- పీఎస్సీలు పరిపాలనకు వెన్నెముక: డిప్యూటీ సీఎం భట్టి

## ఉహుహూ..
# 29 జిల్లాల్లో చలి తీవ్రత

- సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 4.5 డిగ్రీలు
- ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో 4.8...
- సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పదేళ్ల రికార్డు స్థాయి అత్యల్ప ఉష్ణోగ్రతలు

2లో



# తాజ్ మహల్ ను కమ్మేసిన పొగమంచు.. టూరిస్టుల నిరాశ

ఉత్తర భారతాన్ని పొగమంచు కమ్మేసింది. పలు నగరాల్లో ఉదయం వేళ దట్టమైన పొగమంచు అలముకుంటోంది. రెండు మూడు అడుగుల దూరంలో ఎదురుగా ఏముందో కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ఆగ్రాలోని తాజ్ మహల్ ను సందర్శించిన పర్యాటకులు పొగమంచు కారణంగా తాజ్ అందాలను చూడలేకపోతున్నామని వాపోతున్నారు. తాజ్ మహల్ అందాలను కనులారా వీక్షించాలని వేల కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న సందర్శకులు, పొగమంచు కారణంగా ఏమీ కనిపించకపోవడంతో తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. శనివారం ఉదయం పొగమంచు తాజ్ మహల్ ను కమ్మేసిన దృశ్యాన్ని ఓ పర్యాటకుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వ్యూ పాయింట్ నుంచి చూస్తే తెల్లటి పొగమంచు తప్ప తాజ్ కనిపించలేదని ఆయన పేర్కొన్నారు. ఆ వీడియో చూసిన నెటిజన్లు అక్కడ తాజ్ మహల్ ఎక్కడుందంటూ కామెంట్లు పెడుతున్నారు. శనివారం ఉదయం తాజ్ మహల్ ప్రధాన ద్వారం వద్ద నిలబడినా లోపల ఉన్న కట్టడం కనిపించలేదు. దీంతో పర్యాటకులు దీనిని 'తాజ్ మహల్' అనాలా? లేక 'ఫాగ్ మహల్' అనాలా? అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు. తాజ్ మహల్ ముందు సెల్ఫీలు, ఫోటోలు దిగాలనుకున్న పర్యాటకులకు కేవలం తెల్లటి పొగమంచు మాత్రమే బ్యాక్ గ్రౌండ్‌లో కనిపిస్తోంది. మంచు కారణంగా విమానాలు, రైళ్లు ఆలస్యమవడమే కాకుండా, తాజ్ మహల్ సరిగ్గా కనిపించకపోవడంతో గైడ్లు, స్థానిక వ్యాపారుల ఉపాధిపై కూడా ప్రభావం పడుతోంది. రానున్న కొన్ని రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో తాజ్ మహల్ సందర్శనకు వచ్చే వారు వాతావరణం చూసుకుని రావాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఇతర మతాలను కించపరిస్తే కఠిన చర్యలు.. ఆ చట్టం తీసుకువస్తాం

ఇతర మతాలను ఎవరైనా కించపరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో హేట్ రేట్ చట్టం ప్రవేశపెడతామని వెల్లడించారు. ఎవరి మతాన్ని వారు ఆచరించే స్వేచ్ఛను తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ఇటీవల కర్ణాటక ప్రభుత్వం ఇతర మతాలను కించపరచకుండా చట్టాన్ని సవరించిందని గుర్తు చేశారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నామంటే సోనియా గాంధీ పాత్ర, త్యాగం ఉందని అన్నారు. డిసెంబర్ నెల కాంగ్రెస్ పార్టీకి చాలా కీలకమైనదని ఆయన అన్నారు. డిసెంబరు నెలలో ప్రజాప్రభుత్వం ఏర్పడిందని, సోనియా గాంధీ ఇదే నెలలో జన్మించారని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఏసు ప్రభువు బోధనల స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. శాంతిని కాపాడుతూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పేదవాడి ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఆహార భద్రత చట్టాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. ప్రతి పేదవాడికి నెలకు 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని, ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో వ్యవసాయంపై రూ.1.04 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని అన్నారు. ద్వేషించే వారిని కూడా ప్రేమించేలా జీసస్ చేశారని, ప్రపంచానికి ఆయన శాంతి సందేశం అందించారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మనిషి సగటు జీవన ప్రమాణం 32 ఏళ్లు అయితే ప్రస్తుతం 72గా ఉందని, ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత చేశాయో క్రైస్తవ మిషనరీలు కూడా అంతేచేశాయని ప్రశంసించారు.

## పాలనకు భూ బకాసురులు అడ్డంకులు సృష్టిస్తున్నారు

రాష్ట్రంలో తాను యజ్ఞంలా పాలన చేస్తుంటే, కొందరు భూ బకాసురులు అడ్డంకులు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. అభివృద్ధి కార్యక్రమాలకు అడుగడుగునా కేసులు వేస్తూ ఆటంకం కలిగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అనకాపల్లిలో జరిగిన 'స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చంద్రబాబు ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే, దానిపై 40 నుంచి 50 కేసులు వేశారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా, కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినా కోర్టుల్లో కేసులు వేశారని విమర్శించారు. రాష్ట్రానికి ఐటీ కంపెనీలు వస్తుంటే వాటిపైనా కేసులు వేస్తున్నారని అన్నారు. ఒకవైపు పనిచేస్తూనే, మరోవైపు ఈ కేసులపై పోరాడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైద్య కళాశాలలపై వస్తున్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ఇవ్వలేదని, కేవలం మేనేజ్‌మెంట్‌కు మాత్రమే అప్పగించామని స్పష్టం చేశారు. దీనివల్ల రాష్ట్రంలో మెడికల్ సీట్లు పెరుగుతాయని తెలిపారు. ఆ ఆసుపత్రుల్లో చేరే పేషెంట్లందరికీ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచితంగానే వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కావాలనే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. విశాఖపట్నంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని, ప్రపంచంలోని 150 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని గుర్తుచేశారు. భూ బకాసురులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, అనుకున్న లక్ష్యాలను సాధించి తీరుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

## పవనన్న చేసిన భగీరథ ప్రయత్నం ఫలించింది

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం మరో కీలక హామీని నెరవేర్చే దిశగా ముందడుగు వేసింది. ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి పవన్ కల్యాణ్ 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ పథకం ద్వారా ప్రజల దాహార్తి తీర్చడానికి కృషి చేయనున్నారు. ఈ కార్యక్రమంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన జలాలు అందించేందుకు పవన్ చేసిన భగీరథ ప్రయత్నం ఫలించిందని కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మరో హామీని నెరవేరుస్తున్న పవన్ కల్యాణ్‌కు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మంత్రి లోకేశ్ శుభాకాంక్షలపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నామని చెప్పారు. "ప్రజలందరికీ రోజుకు కనీసం 55 లీటర్ల సురక్షిత త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జల్ జీవన్ మిషన్ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యం లోని కూటమి ప్రభుత్వం ద్వారా, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రిగా ఈ అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఉభయ గోదావరి జిల్లాల ప్రజల దాహార్తి తీర్చే ఈ 'అమరజీవి జలధార ప్రాజెక్ట్' పట్ల అభినందనలు తెలియజేసినందుకు మిత్రుడు, సహచర మంత్రివర్యుడు నారా లోకేశ్ కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గారిని నిరంతరం స్మరించుకునేలా మధ్యాహ్న భోజన పథకానికి నామకరణం చేసినందుకు, ఆవిడ జన్మించిన గోదావరి నేల నుంచి మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అంటూ పవన్ కల్యాణ్ ఎక్స్‌లో స్పందించారు.

## బెంగాల్‌లో ప్రతికూల వాతావరణం..
## వెనక్కి తిరిగి వచ్చిన మోదీ హెలికాప్టర్

పశ్చిమ బెంగాల్‌లో ప్రతికూల వాతావరణం కారణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ వెనక్కి మళ్లించారు. ఆయన నాడియాలో జరిగిన ర్యాలీలో ప్రసంగించాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించకపోవడంతో హెలికాప్టర్ తాహెర్‌పూర్ హెలిప్యాడ్‌లో దిగలేక కోల్‌కతా విమానాశ్రయానికి తిరిగి వచ్చింది. హెలికాప్టర్ హెలిప్యాడ్ వద్ద దిగడానికి అక్కడే కొద్దిసేపు చక్కర్లు కొట్టినప్పటికీ ఫలితం లేకపోవడంతో తిరిగి వచ్చిందని అధికారులు తెలిపారు. ఉత్తర భారతాన్ని పొగమంచు కమ్మేయడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో భాగంగా శనివారం ఉదయం ప్రధాని మోదీ కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో తాహెర్‌పూర్‌కు బయలుదేరారు. అయితే పొగమంచు కారణంగా హెలిప్యాడ్‌పై ల్యాండింగ్ సాధ్యం కాలేదు. దాంతో పైలట్ ల్యాండింగ్‌కు కొద్దిసేపు ప్రయత్నించి విఫలమయ్యారు. నాడియా జిల్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొనాల్సి ఉంది. రోడ్డు మార్గంలో వెళితే షెడ్యూల్‌కు అంతరాయం కలుగుతుందని భావించి, విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్ నుంచి ఆయన వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

## ఉహూహూ.. 29 జిల్లాల్లో చలి తీవ్రత

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. నీళ్లు సహా ఏ వస్తువును తాకినా చేతులు ముడుచుకుపోతున్నాయి. రాత్రయిందంటే చాలు ఇంట్లో ఉన్నా గజగజే. ఈ ఏడాది అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని జిల్లాల్లో పదేళ్లలో లేనంత తీవ్రంగా చలి ఉంటోంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు రాత్రిపూట రాష్ట్రవ్యాప్తంగా 4.5 నుంచి 11.2 డిగ్రీల సెల్సియస్ మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లాల్లో పదేళ్ల రికార్డుస్థాయి కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ జిల్లాలోని కోహీర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 4.5 డిగ్రీలు నమోదైంది. గతేడాది ఇదే రోజు 17.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. ఈ మండలంలో రాత్రయితే చాలు.. జనం గజగజ వణుకుతున్నారు. ఉదయం 8 గంటల తర్వాతే ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) కూడా కొద్ది రోజులుగా చలిలో గడ్డకట్టిపోతోంది. ఇక్కడా రికార్డు స్థాయిలో 4.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ పదేళ్లలోనే అత్యంత తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**హైదరాబాద్‌లోనూ...**

ఈ ఏడాదిలోనే అత్యంత చలి తీవ్రత శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు నమోదైంది. ఖమ్మం, వనపర్తి, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట మినహా మిగిలిన జిల్లాల్లో 10 డిగ్రీలలోపు, ఈ నాలుగు జిల్లాల్లోనూ 11.2 డిగ్రీలలోపు ఉంది. హైదరాబాద్‌లో 10 డిగ్రీలు నమోదు కాగా హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ) వ్యాప్తంగా తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. శేరిలింగంపల్లిలో 7.8, మల్కాజిగిరిలో 8.3, రాజేంద్రనగర్‌లో 9.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఖమ్మం మినహా అన్ని జిల్లాల్లోనూ పగటిపూట ఉష్ణోగ్రతలు పడిపోయాయి. హనుమకొండలో సాధారణం కన్నా 1.7 డిగ్రీలు తగ్గి 28 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రిపూట కూడా సాధారణం కన్నా 5 డిగ్రీలు పడిపోయింది. హైదరాబాద్‌లో 3.3, పటాన్‌చెరులో 5.1, మహబూబ్‌నగర్‌లో 5.4, మెదక్ జిల్లాలో సాధారణం కన్నా 5.4 డిగ్రీల ఉష్ణోగత తగ్గింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆది, సోమవారాల్లోనూ చలి తీవ్రత ఉండనుంది. రెండు రోజులూ రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోయే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. అన్ని జిల్లాలకు 'ఆరెంజ్' రంగు హెచ్చరికలు జారీ చేసింది.



## భారతీయ ప్రాచీన జ్ఞానంతో ప్రపంచ సమస్యల పరిష్కారం

హైదరాబాద్; గచ్చిబౌలి, న్యూస్‌టుడే: సామాజిక ఐక్యతకు, జాతీయ ప్రగతికి ఆధ్యాత్మికత ఒక బలమైన పునాదిగా పనిచేస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ఆధ్యాత్మిక చైతన్యంతో ప్రేరణ కలిగిన ప్రజలు సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి కృషి చేస్తారని, దేశ నిర్మాణానికి చురుగ్గా సహకరిస్తారని పేర్కొన్నారు. బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ 21వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం గచ్చిబౌలిలోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహించిన 'భారత కాలాతీత జ్ఞానం: శాంతి, పురోగతికి మార్గం' సదస్సులో రాష్ట్రపతి ప్రసంగించారు. భారతీయ ప్రాచీన జ్ఞానం, ఆధ్యాత్మిక వారసత్వం ప్రపంచ మానవాళి ఎదుర్కొంటున్న మానసిక, నైతిక, పర్యావరణ సమస్యలకు పరిష్కారం చూపుతుందని ఆమె అన్నారు. వేల ఏళ్లుగా భారతీయ నాగరికత సత్యం, న్యాయం, కరుణ, ప్రకృతితో మమేకమై జీవించడం వంటి సూత్రాలపై ఆధారపడి ఉందని గుర్తుచేశారు. వసుధైక కుటుంబం భావన నేటి ప్రపంచ శాంతికి అత్యంత అవసరమన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ద్వారా భారతీయ ప్రాచీన జ్ఞానానికి ప్రపంచ గుర్తింపు లభించిందని... తద్వారా ప్రపంచ శాంతికి, మానవ కల్యాణానికి అగ్రదూతగా భారత్ నిలిచిందని ఆమె తెలిపారు. భౌతిక అభివృద్ధితో మాత్రమే జీవితంలో సుఖశాంతులు లభించవని... అంతర్గత స్థిరత్వం, భావోద్వేగాల నియంత్రణ, విలువలతో కూడిన ఆలోచన చాలా అవసరమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధిని కాంక్షించే సమతుల అభివృద్ధి ఉపనిషత్తుల సారాంశానికి అనుగుణంగా ఉందని రాష్ట్రపతి చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ సంకల్పం మనకు స్వావలంబన నేర్పుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ ఇంధనం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రకృతితో సహజీవనం చేయాలనే భారతీయ ఆలోచన విధానం నుంచి ఉద్భవించాయని వివరించారు. భారతీయ విలువలను వివిధ దేశాలకు వ్యాపింపజేస్తున్నాయంటూ బ్రహ్మకుమారీస్ సంస్థను రాష్ట్రపతి అభినందించారు. 21 ఏళ్లుగా విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణం, శాంతి, సానుకూలతలు పెంపొందిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

## పీఎస్సీలకు నిష్పాక్షికతే పునాది

హైదరాబాద్: పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు నిష్పాక్షికతే నైతిక పునాది అని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి.. వినూత్న ఆలోచనలు, నైతికత, ప్రజల పట్ల సానుకూల దృక్పథం కలిగిన సివిల్ సర్వెంట్లు అవసరమన్నారు. సుపరిపాలనలో.. ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థలను నడిపించే వ్యక్తుల నైతికత అత్యంత నిర్ణయాత్మకమన్నారు. దేశసేవ చేసేందుకు నైతిక విలువలు కలిగిన వ్యక్తులను ఎంపిక చేసే బాధ్యత రాజ్యాంగబద్ధ సంస్థలైన పీఎస్సీలపై ఉందని పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో రెండు రోజుల పాటు జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల 26వ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, యూపీఎస్సీ సభ్యులు లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా, దినేశ్ దాసా, రాష్ట్రాల పీఎస్సీల స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ అలోక్‌వర్మ, టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, ఉత్తర్‌ప్రదేశ్ పీఎస్సీ ఛైర్మన్ సంజయ్ శ్రీనేత్, మరికొన్ని రాష్ట్రాల పీఎస్సీల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. "దేశభవిష్యత్తును నిర్ణయించే వ్యక్తులతో కూడిన సమావేశమే ఈ సదస్సు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు నిష్పక్షపాతంగా జరగాలి. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, రహస్య మూల్యాంకనం వంటి విధానాలతో పక్షపాత ధోరణులను నివారించవచ్చు. నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు సమన్యాయం జరగాలి. యూపీఎస్సీ నియామక విధానంపై ఇప్పటికే విదేశాల్లోని నియామక సంస్థలు ఆరా తీస్తున్నాయి. అంతగా ఆ సంస్థ పరపతి సాధించింది. సుపరిపాలన పునాదులను బలోపేతం చేసేలా వికసిత్, ఆత్మనిర్భర్ దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణంలో పీఎస్సీలు కీలకపాత్ర పోషించాలి. డిజిటల్ గవర్నెన్సు, సామాజిక సమ్మిళితం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వాతావరణ మార్పులపై కార్యాచరణ, ఆర్థిక సంస్కరణల అమలు వంటి కీలక బాధ్యతలు.. కొత్తగా ఎంపికవుతున్న అధికారులపై ఉన్నాయి. ప్రభుత్వ పోటీ పరీక్షల్లో అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించకూడదు. వీటి నివారణకు పకడ్బందీ విధానాలను అమలు చేయాలి. అభ్యర్థుల్లో నైతికత, ప్రవర్తన సామర్థ్యాలను అంచనా వేయడానికి పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్మాణాత్మక పద్ధతులు అన్వేషించాలి" అని సూచించారు.

**పారదర్శకతే కీలకం: డిప్యూటీ సీఎం భట్టి**

పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలన వ్యవస్థకు వెన్నెముక వంటివని, పారదర్శక నియామక విధానాలతో ప్రతిభకు సరైన స్థానం లభిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. "సర్వీస్ కమిషన్లు స్పష్టమైన కాలపరిమితితో వార్షిక క్యాలెండర్లు ప్రకటించి, వాటికి కట్టుబడి ఉండాలి. మరిన్ని సంస్కరణలు అమలు చేయాలి. సమానత్వంతో కూడిన ప్రతిభను ప్రోత్సహించి ప్రజల్లో నమ్మకం పెంచాలి. రాజకీయ ప్రభావాలకు లోనుకాకుండా పనిచేయాలి. సామాజిక న్యాయం, సమానావకాశాలు అందించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, అవసరమైన చోట ప్రత్యేకంగా అర్హత నిబంధనల సడలింపు, సమాన ప్రాతినిధ్యం లభించేలా పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ముందస్తు జాగ్రత్తలు, నిష్పక్షపాతంగా వ్యవహరించడం ద్వారా న్యాయవివాదాలను తగ్గించవచ్చు. నోటిఫికేషన్ల రూపకల్పనలో న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలి. ఏటా పోటీ పరీక్షలకు లక్షల మంది దరఖాస్తు చేస్తున్నారు. ప్రతి విషయంలోనూ స్పష్టతతో వ్యవహరించాలి. ప్రశ్నపత్రం తయారీ నుంచి మూల్యాంకనం వరకు.. షార్ట్‌లిస్టు నుంచి తుది ఎంపిక వరకు ఎక్కడా అనుమానాలకు తావివ్వకూడదు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని వెల్లడిస్తూ పక్షపాతరహితంగా వ్యవహరించాలి. ప్రశ్నపత్రాల లీకేజీ అంటే.. ప్రజాసేవ విలువలకు, సర్వీస్ కమిషన్ల నైతికతకు ద్రోహం చేయడమే. ఇలాంటివి జరగకుండా కమిషన్లు రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలి. డిజిటల్ ప్లాట్‌ఫాం నుంచి సిబ్బంది వరకు తనిఖీలకు అత్యాధునిక పద్ధతులు ఉపయోగించాలి. ఇంటర్వ్యూ ప్రక్రియను మరింత మెరుగుపరచాలి. సదస్సులో చేసిన తీర్మానాలు అమలు చేయాలి" అని సూచించారు.

## ఘనంగా వైఎస్ఆర్ సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి,శేర్లింగంపల్లి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని సౌత్ ఆఫ్రికా వైయస్సార్సీపి ఎన్నారై కన్వీనర్ విక్రంరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాదులో ఘనంగా నిర్వహించారు. శేర్లింగంపల్లి మియాపూర్ మయూరి నగర్ లోని ఓల్డ్ ఏజ్ వెల్ఫేర్ సెంటర్ లో వృద్ధులకు దుప్పట్లు, పళ్ళు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అధికార ప్రతినిధి కాలమూరు వెంకటరెడ్డి, శ్యామల ముఖ్య అతిథులకు హాజరయ్యారు.అభిమానులు కార్యకర్తలు మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కారుమూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ సౌత్ ఆఫ్రికాలో ఉన్న తెలుగువారికి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సేవ చేయాలని మంచి ఉద్దేశంతో వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు చేయడం అర్షనీయమని ఆయన అన్నారు. మరోవైపు అధికార ప్రతినిధి శ్యామల జగన్మోహన్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సౌత్ ఆఫ్రికా వైఎస్ఆర్సిపి ఎన్నారై కన్వీనర్ విక్రం రెడ్డి, వారి సతీమణి, కళా నరసింహారెడ్డి,విజయ భాస్కర్ రెడ్డి ,ఎన్టీఆర్ జిల్లా ఐ టి వింగ్ పృధ్వి వర్మ, రంజిత్ కుమార్ ,సురేంద్ర కుమార్, గోపిరాజు, సత్యం కృష్ణ ,వినాయకరావు ,తదితరులు పాల్గొన్నారు

## వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా బిజెపి బలపరిచిన అభ్యర్థి మట్ట వెంకటేశ్వర రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలుపొందడం హర్షం ప్రకటిస్తూ శనివారం గంభీరావుపేట మండలంలోని మా వృద్ధాశ్రమంలో ముస్తాబాద్ బిజెపి యువ నాయకులు శనివారం పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీని భారతీయ జనతా పార్టీ అత్యధిక మెజారిటీతో గెలుపొందడం శుభసూచకం అన్నారు. నేటి నుంచి ముస్తాబాద్ గ్రామ పంచాయతీకి మంచి రోజులు వచ్చాయన్నారు. కరీంనగర్ ఎంపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ అండదండలతో మండలంలోని ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడంలో సర్పంచ్ మట్ట వెంకటేశ్వర రెడ్డి ముందు వరుసలో ఉంటాడన్నారు. గతంలో ఆయన ముస్తాబాద్ మండలంలో జడ్పిటిసిగా ఉన్నప్పుడు చేసిన సేవలు మరువలేనివి అన్నారు. అదే తరహాలో ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీని ఉమ్మడి కరీంనగర్ జిల్లా మొత్తంగా ఓ రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మలుగారి నర్సాగౌడ్‌తోపాటు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, గంగాల రాజేష్, దీటి కిరణ్, రంజాన్ వెంకటేష్, దీటి రాహుల్, బండి ప్రశాంత్, అబ్రమేని అరుణ్ కుమార్, పర్స అఖిల్ పాల్గొన్నారు.

## మూత పడ్డ సూపర్ మాక్స్ కంపెనీలో విలువైన యంత్రాలు మాయం

* జీడిమెట్ల పీఎస్.లో ఫిర్యాదు చేసిన కార్మిక నాయకులు






కుత్బుల్లాపూర్ (ప్రజాస్ఫూర్తి): జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సూపర్ మాక్స్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ లో రూ.కోట్ల విలువైన యంత్ర సామాగ్రి చోరీకి గురైందని కార్మికులు జీడిమెట్ల పోలీస్ స్టేషన్ లోఫిర్యాదు చేశారు.ఈ పరిశ్రమ మూడేళ్ల క్రితం మూతపడిందని,ప్రస్తుతం ఎన్.సి.ఎల్.టి (నేషనల్ కంపెనీస్ లా ట్రిబ్యునల్) పరిధిలో ఉంది.బ్లేడ్స్ తయారు చేసే యూనిట్ యంత్ర మిషినరీ లు మొత్తం మాయమైనట్టు కార్మికులు ఫిర్యాదులో పేర్కొన్నారు.జీడిమెట్ల సిఐ.గడ్డం మల్లేష్ ఆదేశాల మేరకు క్రైమ్ సిబ్బంది పరిశ్రమను కార్మికులతో కలిసి పరిశీలించారు.దాదాపు పది లారీల్లో పట్టే అంత యంత్రాలు మాయమైనట్టు ప్రాథమికంగా గుర్తించారు.ఈ కంపెనీలో యజమాన్యానికి కార్మికులకు మధ్య కోర్టులో వివాదం నడుస్తుంది.బకాయిలు చెల్లించాలని కార్మికులు లేబర్ కోర్టును ఆశ్రయించారు.ఈ క్రమంలో విలువైన యంత్రాలు మాయం కావడం చర్చనీయాంశంగా మారింది.కంపెనీ సెక్యూరిటీ కి తెలియకుండా యంత్రాలు బయటకు ఎలా వెళ్లాయని యూనియన్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.కాగా కార్మికులు ఇచ్చిన ఫిర్యాదును అధికారికంగా తీసుకోవడానికి తమకు అనుమతి లేదని జీడిమెట్ల సిఐ.గడ్డం మల్లేష్ తెలిపారు.ఎన్సిఎల్టి అధికారులు సోమవారం వచ్చి ఫిర్యాదు చేస్తామని తెలిపినట్టు పేర్కొన్నారు.మాయమైన యంత్రాల విలువ 50కోట్లకు పైగా ఉంటుందని యూనియన్ జేఏసీ నాయకులు పేర్కొంటున్నారు.

# సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు భాగస్వాములు కావాలి

* జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా పర్యాటక రంగం అభివృద్ధిలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు భాగస్వాములు కావాలనిజిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసే బాధ్యతను సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు స్వీకరించి, యువతలో చైతన్యం కలిగించే విధంగా భాగస్వాములుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పర్యాటక రంగ అభివృద్ధి, ముక్కోటి సందర్భంగా నిర్వహించనున్న ఏరు రివర్ ఫెస్టివల్ను విజయవంతం చేయడానికి చేపట్టవలసిన చర్యలపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రకృతి సౌందర్యం, ఆధ్యాత్మికత, గిరిజన సంస్కృతి సమ్మేళనంగా ఉన్న జిల్లాగా గుర్తింపు పొందిందని అన్నారు. జిల్లాలోని పగిడేరు వేడి నీళ్లు, గోదావరి నది పరివాహక ప్రాంతాలు, కనిగిరి గుట్టలు, కిన్నెరసాని అడవీ ప్రాంతాలు వంటి అనేక




విశిష్టమైన పర్యాటక కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతాలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పర్యాటక పటంలో స్థిరపరచడానికి విస్తృత స్థాయి ప్రచారం అత్యవసరమని అన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలాన్ని చేకూర్చవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పర్యాటకుల రాక పెరిగితే హోటళ్లు, రవాణా, హస్తకళలు, స్థానిక వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను ఎకో టూరిజం హబ్‌లుగా అభివృద్ధి చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని వివరించారు. పర్యాటక రంగంలో సోషల్ మీడియా పాత్ర కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను వీడియోలు, ఫోటోలు, కథనాల రూపంలో డిజిటల్ వేదికల ద్వారా ప్రజలకు చేరవేస్తే జిల్లాకు విశేష గుర్తింపు లభిస్తుందని అన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని సానుకూల సందేశాలతో జిల్లాను ప్రమోట్ చేయాలని సూచించారు. ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఏరు రివర్ ఫెస్టివల్ను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 22వ తేదీన బెండలపాడు లోని కనిగిరి గుట్టల ట్రెక్కింగ్, 23వ తేదీన కిన్నెరసాని రివర్ వాక్ ముత్తాపురం నుండి మొతలగూడెం బ్రిడ్జి వరకు సుమారు మూడున్నర కిలోమీటర్ల వాకింగ్ కార్యక్రమం, 24వ తేదీన పాల్వంచలోని శ్రీనివాస్ గిరి గుట్ట ట్రెక్కింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 26వ తేదీన దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్పలో సాయంత్రం 4.30 గంటలకు ట్రైబల్ ఈవినింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యాలు, సంస్కృతి, జీవన విధానాన్ని ప్రతిబింబించే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.27వ తేదీన భద్రాచలం గోదావరి నది ఒడ్డున సాంస్కృతిక కార్యక్రమాలు, ఆసక్తి గల యువత ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని తెలిపారు.28వ తేదీన గోదావరి నది ఒడ్డున సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు, 29వ తేదీన పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు,30వ తేదీన వైకుంఠ ద్వార దర్శనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. పర్యాటకుల సౌకర్యార్థం గోదావరి నది ఒడ్డున క్యాంపులు కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాలన్నింటిలో ఆసక్తి గల యువత, పర్యాటకులు చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు జిల్లాలో జరుగుతున్న పర్యాటక, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారంలో భాగస్వాములై, విస్తృత స్థాయిలో ప్రజలకు చేరవేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. యువతను చైతన్యపరచే విధంగా సానుకూల దృక్పథంతో కార్యక్రమాలను ప్రచారం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భారత రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యత కేవలం న్యాయస్థానాలకు, న్యాయవాదులకు మాత్రమే కాకుండా ప్రతీ ఒక్క పౌరునిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ స్పష్టం చేశారు.సమసమాజ స్థాపన,సమానత్వం,సామాజిక న్యాయం అనే లక్ష్యాలతో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగ విలువలను కాపాడుకోవడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.శనివారం కొత్తగూడెం క్లబ్‌లో ఐ.ఎల్.పీ.ఏ జాతీయ అధ్యక్షురాలు కె.సుజాత చౌదంతి అధ్యక్షతన నిర్వహించిన ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.పీ.ఏ) తెలంగాణ రాష్ట్ర ఐదవ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కేవలం చట్టాల సమాహారం మాత్రమే కాకుండా,దేశ ప్రజల జీవన విధానాన్ని దిశానిర్దేశం చేసే మహత్తర గ్రంథమని అన్నారు.సమాన హక్కులు, మానవగౌరవం,స్వేచ్ఛ,సోదరభావం వంటి విలువలను ప్రజలందరికీ అందించాలనే సంకల్పంతో రాజ్యాంగం రచించబడిందని వివరించారు.రాజ్యాంగంలో పొందుపరిచిన మౌలిక హక్కులు,దిశానిర్దేశక సూత్రాలు సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పునాదులుగా నిలుస్తున్నాయని,వాటిని కాపాడే బాధ్యత న్యాయవ్యవస్థతో పాటు సమాజంలోని ప్రతీ ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు.ముఖ్యంగా న్యాయవాదులు రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.నేటి కాలంలో రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉందని,ఈ దిశగా ఇటువంటి రాష్ట్ర స్థాయి మహాసభలు న్యాయవాదుల మధ్య చర్చకు,ఆలోచనలకు,మార్గదర్శకత్వానికి దోహదపడతాయని జిల్లా జడ్జి




తెలిపారు.న్యాయవృత్తిలో నైతిక విలువలు,సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ఈ తరహా సదస్సులు ఉపయోగపడతాయని అన్నారు.ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు రాజ్యాంగం,న్యాయస్థానాల విధులు,చట్టాల పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని,భవిష్యత్తులో న్యాయవాదులు గ్రామస్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరముందని సూచించారు.అలా చేసినప్పుడే నిజమైన న్యాయసమాజం ఆవిర్భవిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచిన ఐ.ఎల్.పీ.ఏ తెలంగాణ యూనిట్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ,న్యాయవాదుల హక్కులు,సమస్యలు,భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా ఐ.ఎల్.పీ.ఏ మరిన్ని సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపట్టి న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరచాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సరిత,న్యాయమూర్తులు కిరణ్ కుమార్ కవిత,రాజేందర్,సుచరిత,రవికుమార్,వినయ్ కుమార్, సూరీరెడ్డి ఎం.రాజమల్లు,బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ,ఐ.ఎల్.పీ.ఏ తెలంగాణ బాధ్యులు శాంసన్,దేవరాజ్ గౌడ్, లక్ష్మీదేవి, సైనీ నాగేందర్, అదనం కామర్తదితరులు పాల్గొన్నారు

## కాప్రా డివిజన్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగనున్న, తోటకూర శ్రీకాంత్

ప్రజాస్ఫూర్తి, కాప్రా : రాబోయే 2026లో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాప్రా డివిజన్ నుంచి పోటీ చేయడానికి తాను సిద్ధమవుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు తోటకూర శ్రీకాంత్ అధికారికంగా ప్రకటించారు.గత ఐదేళ్లుగా కాప్రా డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రజల సేవలో నిబద్ధతతో పనిచేస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.ఈ కాలంలో తాగునీటి సమస్యలు, డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, పేదల సంక్షేమ పథకాలు, వృద్ధులు-మహిళలు-యువత సమస్యల పరిష్కారం వంటి అనేక అంశాలపై ప్రజలతో కలిసి ఉద్యమిస్తూ, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాలు సాధించేందుకు శ్రమించానని ఆయన అన్నారు.ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయడమే తన రాజకీయ లక్ష్యమని, అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల తరఫున ప్రశ్నించే ధైర్యం కాంగ్రెస్ పార్టీకే ఉందని తోటకూర శ్రీకాంత్ స్పష్టం చేశారు. కాప్రా డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తన సంకల్పమని పేర్కొన్నారు.రాబోయేఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగి, పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమిస్తానని, అలాగే కాప్రా డివిజన్ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి అభివృద్ధి కోసం తన శక్తి మేరకు పని చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ప్రజల ఆశీస్సులు, పార్టీ నాయకుల మార్గనిర్దేశంతో కాప్రా డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, కాంగ్రెస్ పార్టీ



విజయమే ధ్యేయంగా ముందుకు సాగుతానని తోటకూర శ్రీకాంత్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మండల స్థాయిలో జరిగిన మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్‌లో ముస్తాబాద్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని కంతుల అక్షిత మంచి ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించింది. దీంతో ఆమె జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యిందని గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు యాదగిరి తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన అక్షితను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు

**: భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో శనివారం భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజుపేట,జగదీశ్ కాలనీల్లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం ను నిర్వహించారు.ఇందులో భాగంగా మొత్తం సుమారుగా 300 ఇండ్లలో సోదాలు నిర్వహించి సరిగా పత్రాలు లేకుండా నెంబర్ ప్లేట్లు లేని 66 ద్విచక్ర వాహనాలను,05 ఆటోలను,ఒక ట్రాలీను సీజ్ చేయడం జరిగింది.అంతేకాకుండా 85 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాదీనం చేసుకుని,సంభంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు.అనంతరం కాలనీ వాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఏఎస్పీ విక్రాంత్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మట్కా, జూదం, కోడిపందాలు, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. విపత్కర సమయాల్లో ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100నకు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను పొందాలని సూచించారు.సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాలలో సీసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.భద్రాచలం ఇన్స్పెక్టర్ నాగరాజు,ఎస్సైలు తిరుపతి,స్వప్న,సతీష్,శ్యామ్,సీఆర్పీఎఫ్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవంతంగా జాతీయ ఔషధ విద్యా ,పరిశోధనా సంస్థ 13వ స్నాతకోత్సవం

కూకట్ పల్లి,ప్రజాస్ఫూర్తి : జాతీయ ఔషధ విద్యా ,పరిశోధనా సంస్థ (నైపర్), హైదరాబాద్ 13వ స్నాతకోత్సవంశనివారం ఆడిటోరియంలో విజయవంతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఉత్తరాఖండ్ సాంకేతిక విశ్వవిద్యాలయం , ఉత్తరప్రదేశ్ సాంకేతిక విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, ఎఐయూ -న్యూఢిల్లీ మాజీ అధ్యక్షుడు, యూజీసీ, డీఎస్టీ, ఎన్ఏబిఎల్, ఎన్బిఎ మరియు ఎఐసిటీఈ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ దుర్గ్ సింగ్ చౌహాన్ , ఆరిజీన్ ఆంకాలజీ లిమిటెడ్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి డా. మురళి రామచంద్రలుపాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు, దేశవ్యాప్తంగా ఉన్న నైపర్ సంస్థలడైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగానైపర్ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ శైలేంద్ర సరాఫ్ మాట్లాడుతూ, కేవలం 18 సంవత్సరాల కాలంలోనే నైపర్ హైదరాబాద్ ఔషధ విద్యా ,పరిశోధన రంగంలో అత్యుత్తమ కేంద్రంగా అవతరించిందని తెలిపారు. దీనికి నిదర్శనంగా ఎన్ఐఆర్ఎఫ్-2025లో 5వ ర్యాంక్ సాధించిందని చెప్పారు. బలమైన పరిశోధన ఫలితాలు, పరిశ్రమ-అకాడమిక్ భాగస్వామ్యాలు ,విద్యార్థుల ప్రతిభే ఈ నిరంతర అభివృద్ధికి కారణమని పేర్కొన్నారు.నైపర్ హైదరాబాద్ నుంచి ఉత్తీర్ణులైన పూర్వ విద్యార్థులు, దేశీ-విదేశీ ప్రముఖ ఔషధ పరిశ్రమల్లో, పరిశోధనా సంస్థలు ,విద్యాసంస్థల్లో సేవలందిస్తూ సంస్థ ప్రతిష్ఠను ప్రపంచ స్థాయిలో పెంచుతున్నారని ఆయన తెలిపారు. 2025 సంవత్సరంలో 205 పరిశోధనా వ్యాసాలు ప్రతిష్ఠాత్మక జర్నల్స్‌లో ప్రచురించబడ్డాయని, 28 దాఖలు చేసిన పేటెంట్లలో 07 మంజూరయ్యాయని, అలాగే అధ్యాపకులు ఒకే విద్యా సంవత్సరంలో రూ.7.38 కోట్ల పరిశోధన గ్రాంట్లు సాధించారని వెల్లడించారు. ఇది సంస్థ చరిత్రలోనే అత్యధికమని చెప్పారు. ఈ సందర్భంగా ఔషధ విభాగం, భారత ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.డా. మురళి రామచంద్ర విద్యార్థులను అభినందిస్తూ, ఆరోగ్య రంగంలో రోగి కేంద్రిత విధానం, అందుబాటు ధరలు, ఇంకా తీరని రోగుల అవసరాలు మరియు నాణ్యత ఆధారిత పరిశోధనపై దృష్టి పెట్టాలని సూచించారు.కృత్రిమ మేధస్సు , కొత్త సాంకేతికతల స్వీకరణ, నిరంతర నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ -విశ్వవిద్యాలయ సహకారం, నియంత్రణ అవగాహన అంతరశాఖల సహకారం అవసరమని




చెప్పారు. వైఫల్యాన్ని విజయానికి మెట్టుగా తీసుకొని, 'వికసిత్ భారత్' వంటి జాతీయ కార్యక్రమాలకు యువత సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.స్నాతకోత్సవం సందర్భంగా మొత్తం 222 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయబడ్డాయి. వీరిలో 28 మంది పీహెచ్.డి. పరిశోధకులు కాగా, ఎం.ఎస్. (ఫార్మా.), ఎం.టెక్. (ఫార్మా.) మరియు ఎం.బి.ఏ. (ఫార్మా.) కార్యక్రమాలకు చెందిన 194 మంది విద్యార్థులు ఉన్నారు. ఉత్తమ విద్యా ప్రదర్శనకు గుర్తింపుగా వివిధ విభాగాల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేయబడ్డాయి. గోల్డ్ మెడల్ పొందిన విద్యార్థులు వీరే,ప్రియ వర్షిణి కె (మెడిసినల్ కెమిస్ట్రీ), నివ్డుంగే రోహిత్ సంతోష్ (ఫార్మాస్యూటికల్ అనాలిసిస్), పై సోనాల్ సంతోష్ మరియు సయ్యద్ అలీ అబ్రార్ (ఫార్మకాలజీ & టాక్సికాలజీ),దిషా సాంఖ్యాశ్రీ (రెగ్యులేటరీ టాక్సికాలజీల),సహానే ప్రజక్తా విశ్వనాథ్ (ఫార్మాస్యూటిక్స్), మహమ్మద్ నిజాం వి.పీ. మరియుసౌందర్య ఎం. (రెగ్యులేటరీ అఫైర్స్),హర్షిత ఆర్. (ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్), మధుమిత పి. (నేచురల్ ప్రోడక్ట్స్), లడ్డిపీర్ల మనస గౌడ్ (బయోఫార్మాస్యూటికల్స్),బసీమ సి. [ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (ప్రాసెస్ కెమిస్ట్రీ)],మహాలే యోగేశ్ మహాడు (మెడికల్ డివైసెస్), బాకి మహిమ రెడ్డి (ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్).స్నాతకోత్సవం ముగింపులో డా. శైలేంద్ర సరాఫ్ పట్టభద్రులకు ప్రేరణాత్మక ఉపదేశం (ఎగ్జార్టేషన్) అందించి, వారి వృత్తి జీవితంలో ఉత్తమత, ఆవిష్కరణలు మరియు నైతిక విలువలను పాటిస్తూ ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అనంతరం సంస్థ, అన్ని పట్టభద్రులను ,గోల్డ్ మెడల్ విజేతలను వారి విశిష్ట విద్యా విజయాలకుగాను హృదయపూర్వకంగా అభినందిస్తూ, వారు భారతదేశంలోనే కాక విదేశాల్లో కూడా విద్య, పరిశ్రమ, పరిశోధన మరియు ఆరోగ్య రంగాల్లో ముఖ్యమైన సేవలు అందిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. ఉత్సాహభరిత వాతావరణంలో దీక్షాంత సమారోహం ముగిసింది.

## రోజుకో పూట చపాతీ తినాలట!



**బరువు తగ్గాలనుకునే వారు ప్రతి విషయంలోనూ ప్రత్యామ్నాయాల్ని వెతుక్కుంటుంటారు. రాత్రుళ్లు అన్నం మానేసి చపాతీ తీసుకోవడం కూడా ఇలాంటిదే! అయితే రాత్రి భోజనంలో చపాతీని భాగం చేసుకోవడం వల్ల బరువు తగ్గడంతో పాటు మరెన్నో ఆరోగ్య ప్రయోజనాల్ని సొంతం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. మరి, చపాతీలో దాగున్న ఆ ఆరోగ్య రహస్యాలేంటో తెలుసుకుందాం రండి..**

### పోషకాల సమ్మేళనం!

* చపాతీని పోషకాల సమ్మేళనంగా పేర్కొంటున్నారు నిపుణులు. ఇందులో 'బి', 'ఇ' విటమిన్లతో పాటు కాపర్, జింక్, అయొడిన్, మాంగనీస్, సిలికాన్, పొటాషియం, క్యాల్షియం.. వంటి ఖనిజాలు లభిస్తాయి. అంటే.. ఇవన్నీ రోజువారీ శరీరానికి కావాల్సిన పోషకాలను కొద్ది మొత్తాల్లో భర్తీ చేస్తాయన్నమాట!
* చపాతీలో ఉండే సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు శరీరానికి శక్తిని అందిస్తాయి. తద్వారా రోజంతా ఉత్సాహంగా ఉండచ్చు.
* చపాతీల్లో ఉండే ఐరన్ స్థాయులు శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయుల్ని క్రమబద్ధీకరిస్తాయి.
* చపాతీల్లో ఉండే జింక్, ఇతర ఖనిజాలు చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహకరిస్తాయంటున్నారు నిపుణులు.
* ఇందులో ఉండే పీచు జీర్ణవ్యవస్థకూ మంచిదే! అజీర్తి, గ్యాస్, మలబద్ధకం.. వంటి జీర్ణ సంబంధిత సమస్యలున్న వారు నిపుణుల సలహా మేరకు రోజూ చపాతీని ఆహారంలో భాగం చేసుకోవడం ఉత్తమం.
* గుండె ఆరోగ్యానికీ చపాతీ మేలు చేస్తుందట! ఇందుకు దీనిలో అతి తక్కువ కొవ్వులుండడమే కారణమంటున్నారు నిపుణులు.

### ఇలా చేసుకోవాలట!

* చపాతీ ఆరోగ్యానికి మంచిదే కదా అని ఎక్కువ నూనె, నెయ్యితో చేసుకోవడం వల్ల శరీరంలో అనవసర కొవ్వులు చేరతాయంటున్నారు నిపుణులు. అందుకే వీలైనంత తక్కువ నెయ్యి/నూనెను వాడడం మంచిదంటున్నారు. అసలు ఈ రెండూ ఉపయోగించకుండా పుల్కా చేసుకొని తింటే మరీ మంచిదట!
* బయట దొరికే గోధుమపిండిలో మైదా కలిసే అవకాశం ఉంటుంది. కాబట్టి ముడిగోధుమలు తీసుకొని స్వయంగా పట్టించుకొని ఆ పిండితో చపాతీ చేసుకుంటే మంచిది.
* చపాతీకి జతగా రోజూ పప్పు, బంగాళాదుంప కర్రీ అని కాకుండా అన్ని రకాల కాయగూరలతో చేసిన కూరలు తీసుకోవడం వల్ల పోషకాలన్నీ శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు.
* బీన్స్, క్యారట్ ముక్కలు, పాలకూర.. వంటి వాటిని ఉడికించి.. గోధుమ పిండి కలిపేటప్పుడు అందులో వేసి చపాతీ చేసుకుంటే అటు రుచికి రుచి.. ఇటు ఆరోగ్యానికి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చట.
* గోధుమపిండికి రాగి పిండి, సోయాబీన్ పిండి, చిరుధాన్యాలతో తయారుచేసిన పిండి.. వంటివి కూడా కలుపుకొని చపాతీ తయారుచేసుకోవచ్చు. లేదంటే బయట దొరికే మల్టీగ్రెయిన్ పిండిని కూడా వాడుకోవచ్చు. అయితే అందులో మైదా 0%గా ఉండాలన్న విషయం గుర్తుపెట్టుకోండి. ఈ విషయం లేబుల్ చూస్తే అర్థమవుతుంది.

## 'మసాబా'ని మెచ్చేస్తున్నారు!

**ఫ్యాషన్ ప్రపంచంపై కాస్త అవగాహన ఉన్నవాళ్లకైనా డిజైనర్ మసాబా గుప్తా పరిచయం అక్కర్లేదు. ఇక ఆవిడ డిజైన్లకు ప్రధాన మోడల్ ఎవరంటే ఆమె తల్లి, నటి నీనా గుప్తానే! వీళ్లిద్దరి కాంబినేషన్‌కి ప్రత్యేక అభిమాన గణమే ఉంది. ఓసారి అలా నీనా చీర... దానికి జతగా నూడుల్ స్ట్రాప్ హాల్టర్ నెక్ బ్లవుజు వేసుకున్న ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. దానికి నెటిజన్లు ఫిదా అయ్యారు. ఆ తరవాతా అదే రకం బ్లవుజుల్లో మెరిశారామె. సంప్రదాయ వస్త్రానికి మోడరన్ టచ్ అంటూ ఫ్యాషన్ ప్రియులంతా ఆ డిజైన్‌పై మనసు పడ్డారు. 'మసాబా కట్', 'మసాబా బ్లవుజ్' అంటూ పేరు పెట్టి మరీ పాపులర్ చేశారు. ఈ ఫొటోలన్నీ అందుకు సాక్ష్యాలే! చీరలోనూ ఆధునిక ముద్ర వేయాలనుకునే అమ్మాయిలే ఎక్కువ. నేటితరం ఆసక్తికి తగ్గట్టుగా ఈ మసాబా కట్ కనిపించింది. కాబట్టే, తెగ ప్రయత్నించేస్తున్నారు. అయితే బ్లవుజులకే పరిమితం కాలేదు. డ్రెస్‌లకీ ప్రయత్నిస్తున్నారు. మీ సంగతేంటి? మీకూ నచ్చిందా? ఇంకేం ఈ రకం డిజైన్‌నీ ప్రయత్నించేయండి మరి!**











# 'ఉపాధి హామీ' పేరు మార్పును వ్యతిరేకిస్తూ.. పీసీసీ ఆధ్వర్యంలో నిరసన

హైదరాబాద్: ఉపాధి హామీ పథకం పేరు మార్పును వ్యతిరేకిస్తూ నగరంలో కాంగ్రెస్ నేతలు నిరసన చేపట్టారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ ఎంజీ రోడ్‌లో పీసీసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసనలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, జూపల్లి కృష్ణారావు, వివేక్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, వీహెచ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గాంధీ కుటుంబం పేరు చెబితే భాజపా నేతల గుండెల్లో రైళ్లు పరుగెడతాయన్నారు. గాడ్సేని పూజించే వారు కాబట్టే గాంధీ పేరు తొలగించారని మండిపడ్డారు. " గాంధీ కుటుంబాన్ని ధైర్యంగా ఎదుర్కొనే ధైర్యం మోదీ, అమిత్‌షాకు లేదు. గాంధీ పేరు చిరస్మరణీయం. ప్రజలకు 100 రోజుల ఉపాధి కోసం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. 2014లో అధికారంలోకి వచ్చిన భాజపా ఈ పథకానికి నిధుల కోత పెడుతూ వస్తోంది. జాతీయ ఉపాధి



హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం అప్రజాస్వామికం. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు భాజపా తెరలేపింది. సోనియా గాంధీ కుటుంబంపై కక్షపూరితంగా కేసులు పెడుతున్నారు. లౌకికవాద దేశంలో మోదీ, అమిత్ షా పప్పులు ఉడకవు. కులాలు, మతాల పేరిట రాజకీయం చేసేవారికి గుణపాఠం తప్పదు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం'' అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.




## రూ.14కోట్ల సైబర్ మోసం..
## సత్తుపల్లికి చెందిన నలుగురి అరెస్ట్

హైదరాబాద్: సైబర్ నేరాలు ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. నకిలీ పెట్టుబడుల పేరిట జరిగిన మోసంలో ఓ వైద్యుడు ఏకంగా రూ.14.61 కోట్లను పోగొట్టుకున్నారు. సైబర్‌మోసంలో ఇంత పెద్ద మొత్తంలో పోగొట్టుకున్న ఉదంతం రాష్ట్ర చరిత్రలోనే ఇదే తొలిసారి కావడంతో పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈకేసులో ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన బ్రహ్మానాయుడు, పవన్, మణిరామ్, శివకృష్ణను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అరెస్టయిన నలుగురు నిందితులు.. సైబర్ నేరగాళ్లకు మ్యూల్ బ్యాంక్ ఖాతాలు సమకూర్చినట్టు గుర్తించారు. నిందితులను 5 రోజులు కస్టడీకి ఇవ్వాలని నాంపల్లికోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. కస్టడీ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు సోమవారం తీర్పు వెల్లడించనుంది.

## బడ్జెట్ కసరత్తు
## ప్రారంభించిన తెలంగాణ ఆర్థికశాఖ

హైదరాబాద్: తెలంగాణ ఆర్థికశాఖ 202627 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. ఈమేరకు అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు కోరింది. జనవరి 3 లోపు ప్రతిపాదనలు పంపాలని అన్ని శాఖలకు సూచించింది. 202526 ఆర్థిక సంవత్సరంలో సవరించిన ప్రతిపాదనలు కూడా పంపించాలని ఆర్థికశాఖ అధికారులు కోరారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల
## ప్రజలకు మరో రెండేళ్లు కష్టాలు తప్పవు: కేటీఆర్

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల రాష్ట్ర ప్రజలకు మరో రెండేళ్లు కష్టాలు తప్పవని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి ఉండదని విమర్శించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను తెలంగాణ భవన్‌లో సన్మానించిన ఆయన.. రైతులు యూరియా కోసం యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందన్నారు. రైతులకు దుకాణాలలో యూరియా ఇవ్వలేని ప్రభుత్వం.. యాప్‌లో ఇస్తానంటోందని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ చేతగానితనానికి 'యూరియా యాప్' ఒక నిదర్శనమని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఎప్పుడూ ఎరువుల కోసం రైతులు క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి రాలేదన్నారు. కాంగ్రెస్‌కు 66శాతం సర్పంచి స్థానాలు నిజమైతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్, భాజపా రెండు పడవలపై ప్రయాణిస్తున్నారని, ఆ రెండు పార్టీలు పూర్తి అవగాహనతో పనిచేస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు.

## భాజపాలో చేరిన నటి ఆమని

హైదరాబాద్: సినీ నటి ఆమని భాజపాలో చేరారు. నగరంలోని భాజపా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సమక్షంలో కమలదళంలో చేరారు. కండువా కప్పి ఆమనిని ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీకి రామ్ రామ్..
## 50 రోజులకు మించి పని లేదు.. కేంద్రంపై మంత్రి సీతక్క ఆగ్రహం

మహాత్మాగాంధీ పేరును తొలగించి జీరాంజీ పేరుతో ఉపాధి హామీకి రామ్ రామ్ చెబుతోందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న ఈ దాడిని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదని, కూలీల ఉపాధి హక్కును కాపాడుకునేందుకు కలసి కట్టుగా పోరాడుతామని, రాజకీయాలకు అతీతంగా అందరూ ఉపాధి హామీ పరిరక్షణ పోరాటంలో పాలుపంచుకోవాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను నిరసిస్తూ ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి చేశారు. నిరసన కార్యక్రమాల్లో కార్మికులు, కర్షకులు, కూలీలు, సర్పంచులు, ప్రజాస్వామ్యవాదులు ప్రగతిశీల శక్తులు పెద్ద ఎత్తున పాల్గొని



విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో ఆమె పిలుపునిచ్చారు. పల్లెల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి కనీసం వంద రోజుల పాటు ఉపాధి కల్పించేందుకు 20ఏళ్ల క్రితం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టానికి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఉరి వేస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. లోక్ సభలో పూర్తిస్థాయి చర్చ లేకుండా, హడావుడిగా బిల్లును పాస్ చేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఉపాధి హామీ కూలీల్లో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, మహిళలు ఉపాధి పొందుతున్నారని.. వారి ఉపాధిని దెబ్బతీసేందుకు కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా ఉపాధి కూలీల్లో 60 శాతం మహిళలు, తెలంగాణలో ఉపాధి హామీ లబ్ధిదారుల్లో 62 శాతం మహిళలే ఉన్నారని, అలాగే 20 శాతం ఎస్సీలు, 20 శాతం ఎస్టీలు లబ్ధిదారులుగా ఉన్నారని, కేంద్ర వైఖరి కారణంగా వారంతా ఉపాధి కోల్పోయే పరిస్థితి తలెత్తిందని వెల్లడించారు. ఉపాధి హామీ చట్టం కేవలం ఉపాధి హామీ కల్పనకే పరిమితం కాలేదని, మహిళలు అట్టడుగు వర్గాల ఆర్థిక స్వేచ్ఛకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు. జాతిపిత మహాత్మాగాంధీ కలగన్న రామ రాజ్యం, గ్రామ స్వరాజ్యం స్ఫూర్తితో యూపీఏ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. కానీ బీజేపీ ప్రభుత్వం ప్రతి ఏడాది పనిదినాలను తగ్గిస్తూ పేదల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 45 కోట్ల పనిదినాలకు కోత, తెలంగాణలో 5 కోట్ల పనిదినాలకు కోత పెట్టారని తెలిపారు.

## తొలి తెలుగు బంజారా చారిత్రక నవలను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి

తొలిసారిగా గోర్ బంజారా చరిత్రను నవలారూపంలో ఆవిష్కరించడం శుభపరిణామమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రవీంద్రభారతి ఆవరణలోని మంత్రి చాంబర్‌లో తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించిన తొలి తెలుగు గోర్ బంజారా చారిత్రక నవల పోర్యతారను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశ్వవ్యాప్తంగా విస్తరించిన గోర్ బంజారాల ఘన చరిత్ర ఇప్పటివరకు లిఖిత రూపంలో అందుబాటులోకి రాలేదని మంత్రి పేర్కొన్నారు. వారి జీవన విధానం, సంస్కృతి, సాహసాలు, పోరాటాలను నవల రూపంలో వెలికి తీసిన రచయిత ఆమ్ గోత్ వెంకట్ పవార్‌ను అభినందించారు. ఆదివాసీగిరిజన చరిత్రలను ముద్రణలోకి తీసుకువచ్చి తెలంగాణ సాంస్కృతిక, సాహిత్య వారసత్వాన్ని



నిలబెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మెన్ డా. తేజావత్ బెల్లయ్య నాయక్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. బాలాచారి, రచయిత వెంకట్ పవార్, దినకర్ తదితరులు పాల్గొన్నారు

## మళ్లీ చురుకుగా.. మూడు బహిరంగ సభలకు కేసీఆర్ నిర్ణయం..!

చాలా రోజుల విరామం తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ రాజకీయ రంగంలో చురుకుగా కదలబోతున్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలో మూడు బహిరంగ సభలు నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తొలి సభ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రెండో సభ, మరో కీలక ప్రాంతంలో మూడో సభ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, రేపు మధ్యాహ్నం



2 గంటలకు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన BRSLP (బీఆర్ఎస్ లెజిస్లేటివ్ పార్టీ) సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర రాజకీయాలపై కీలక నిర్ణయాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత ఇవ్వనున్నట్లు సమాచారం. కొంతకాలంగా మౌనంగా ఉన్న కేసీఆర్, ఇప్పుడు వరుస కార్యక్రమాలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే దిశగా అడుగులు వేస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రేపటి సమావేశం, ప్రకటనలు బీఆర్ఎస్ రాజకీయ వ్యూహానికి కీలక మలుపు కావొచ్చని టాక్ నడుస్తోంది.

## విలువలు కలిగిన విద్య అందించడమే మా లక్ష్యం: భట్టి

మేడ్చల్ జిల్లా అల్వాల్‌లో లయోలా విద్యాసంస్థల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అసమానతలను తొలగించే శక్తి విద్యే అని అన్నారు. నైపుణ్యంతో పాటు మానవ విలువలు కలిగిన విద్య అందించడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 100 ఐటీఐలను ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మార్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా జీడీపీ వృద్ధికి దోహదం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, సమాన విద్యా అవకాశాల కోసం 100 "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్" నిర్మాణం వేగంగా సాగుతోందని అన్నారు. 2047 నాటికి తెలంగాణను ₹3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో మూలధనం + ఆవిష్కరణ = ఉత్పాదకత అనే సూత్రం వైపు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్య కేవలం డిగ్రీ సంపాదనకోసం కాకుండా, విలువలు మరియు సమాజ బాధ్యతలు కలిగిన పౌరులను తీర్చిదిద్దే శక్తిగా మారాలని వెల్లడించారు. ఐదు దశాబ్దాల విజయప్రస్థానంలో లయోలా విద్యాసంస్థల నిర్వాహకులు,



ఉపాధ్యాయులు, విద్యార్థులకు భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు.

## తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శిగా ఆర్.తిరుపతి నియామకం

తెలంగాణ శాసనసభ నూతన కార్యదర్శిగా ఆర్.తిరుపతి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సీఎస్ రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వీ.నరసింహాచార్యులు తెలంగాణ శాసన మండలి కార్యదర్శిగా నియమితులయ్యారు. రెండో లెజిస్లేచర్ సెక్రటరీ పోస్టు సృష్టించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, రాష్ట్ర గవర్నర్ ఆదేశానుసారం ఈ నియమాకాలను చేపట్టినట్లుగా సీఎస్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనితో అసెంబ్లీకి, మండలికి వేర్వేరుగా కార్యదర్శులను నియమించినట్లైంది. కాగా, తిరుపతి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.



# బంగారు ఆభరణంపై రాముడి జీవితం



జైపూర్: రాజస్థాన్‌లోని జైపూర్ జువెల్లరీ షోలో విభిన్న రీతిలో ఉన్న ఆభరణాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇందులో రాముడి జీవితాన్ని తెలియజేస్తూ రూపొందిన ఓ హారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రామాయణాన్ని చాటిచెప్పే విధంగా విల్లు ఆకారంలో ఉన్న అద్భుత కళాఖండంలో రామ దర్బార్, రామ సేతు కూడా ఉండటం విశేషం. రాముడి బాల్యం మొదలు, వనవాస జీవితం, లంకపై విజయం, రామరాజ్యం ఏర్పాటు వంటి ఆయన జీవితంలోని కీలక ఘట్టాలను వివరించేలా ఈ బంగారు హారాన్ని తీర్చిదిద్దినట్లు నగల వ్యాపారి పేర్కొన్నారు.



ఒక్కో సన్నివేశాన్ని ఒక్కో ప్యానెల్‌లో రూపొందించామన్నారు. దీని కోసం సంప్రదాయ పద్ధతులతోపాటు ఆధునిక సాంకేతికతను ఉపయోగించామని, తుది రూపు తెచ్చేందుకు ఆరు, ఏడు నెలల సమయం పట్టిందన్నారు. ఇందులో 600 గ్రాముల కన్నా ఎక్కువ బంగారం ఉపయోగించినట్లు చెప్పారు. అశోక వాటికలో హనుమంతుడు, సీతాదేవిల మధ్య జరిగిన సంభాషణను పొందుపరిచామన్నారు.

# దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతారా?.. రాహుల్ విదేశీ పర్యటనపై భాజపా



దిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ పర్యటనపై భారతీయ జనతా పార్టీ తీవ్ర విమర్శలు చేసింది. విదేశీ పర్యటనలో దేశ వ్యతిరేక శక్తులతో ఆయన చేతులు కలుపుతున్నారని ఆరోపించింది. దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టింది. అమెరికాకు చెందిన బిలియనీర్ జార్జ్ సోరోస్‌తో రాహుల్‌కు సంబంధాలు ఉన్నాయంటూ మరోసారి ఆరోపించింది. ఈ మేరకు ఆ పార్టీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా పార్టీ ప్రధాన కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ''విదేశీ గడ్డపై దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ గాంధీ చేతులు కలుపుతున్నారు. రాహుల్ గాంధీ, జార్జ్ సోరోస్ పేరుకే ఇద్దరు వ్యక్తులు. కానీ, వారి ఆత్మ ఒక్కటే'' అని భాటియా వ్యాఖ్యానించారు. జర్మనీ పర్యటనలో బెర్లిన్‌లోని హెర్టీ స్కూల్ ప్రెసిడెంట్ కార్నిలియా వోల్‌తో రాహుల్ గాంధీ భేటీ అయిన ఫొటోను ఈ సందర్భంగా మీడియాకు చూపించారు. భారత వ్యతిరేక శక్తులతో రాహుల్ చేతులు కలుపుతున్నారనడానికి ఇదే నిదర్శనమని ఆరోపించారు. జార్జ్ సోరోస్‌కు చెందిన ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సెంట్రల్ యూరోపియన్ యూనివర్సిటీకి ఆమె ట్రస్టీ అని భాటియా పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు, సమావేశాల సమయంలో రాహుల్ గాంధీ ఇలా తరచూ విదేశీ పర్యటనలు చేయడం కొత్తేమి కాదన్నారు. తన పర్యటనలో భారత్ పట్ల ద్వేషం, దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు కుట్ర పన్నే వ్యక్తులతో భేటీ అవుతుంటారని ఆరోపించారు.

# భారత్ పర్యటన కోసం.. మెస్సికి రూ.89 కోట్లు!



లియోనెల్ మెస్సి భారత పర్యటన సందర్భంగా కోల్‌కతా స్టేడియంలో చోటుచేసుకున్న ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో అరెస్టై.. ప్రస్తుతం కస్టడీలో ఉన్న ఈవెంట్ నిర్వాహకుడు శతాద్రు దత్తాను ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT) విచారిస్తోంది. స్టేడియంలోకి రాగానే అనేకమంది తాకడం, కౌగిలించుకోవడం పట్ల మెస్సి అసౌకర్యానికి గురయ్యాడని, దీంతో నిర్దేశించుకున్న సమయం కన్నా ముందే అక్కడి నుంచి వెళ్లిపోయాడని విచారణలో శతాద్రు చెప్పినట్లు సిట్ వర్గాలు వెల్లడించాయి. అంతేకాకుండా ఈ పర్యటన ఖర్చు, మెస్సికి చెల్లించిన నగదు వివరాలు తెలియజేసినట్లు తెలిసింది.

**కౌగిలింతలతో చిరాకు..**

''గ్రౌండ్‌లో ఉన్న సమయంలో కొందరు వీపును తాకడం, కౌగిలించుకోవడంతో మెస్సి అసౌకర్యానికి గురయ్యాడు. దీనిపై ఆయనకు రక్షణగా ఉన్న విదేశీ భద్రతా అధికారులు ముందుగానే ఆందోళన వ్యక్తం చేశారు. జనసమూహాన్ని అదుపుచేయాలని పదే పదే ప్రకటించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆయన్ను చుట్టుముట్టి, ఆలింగనం చేసుకున్న విధానం ఆమోదయోగ్యం కాదు'' అని దర్యాప్తు అధికారులకు శతాద్రు దత్తా చెప్పినట్లు తెలిసింది. గ్రౌండ్‌లోకి వచ్చేందుకు 150 పాసులను మాత్రమే ఇచ్చినప్పటికీ.. అంతకుమించి మూడింతల మంది అక్కడకు రావడంతో పరిస్థితి చేజారిందని చెప్పినట్లు సమాచారం.

**మెస్సికి రూ.89 కోట్లు..**

''ఈ టూర్ కోసం మెస్సికి రూ.89కోట్లు చెల్లించగా.. ఇందులో భారత ప్రభుత్వానికి రూ.11 కోట్లు పన్నుగా చెల్లించాం'' అని శతాద్రు పోలీసులకు వెల్లడించినట్లు తెలిసింది. ఈ పర్యటన మొత్తం ఖర్చు రూ.100 కోట్లు కాగా.. ఇందులో 30శాతం నిధులను స్పాన్సర్ల నుంచి, మరో 30శాతం టికెట్ల అమ్మకాల ద్వారా సేకరించామని చెప్పినట్లు సమాచారం. శతాద్రుకు సంబంధించి ఇటీవల ఫ్రీజ్ చేసిన అకౌంట్లలో రూ.20 కోట్లు ఉన్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఇవి కోల్‌కతా, హైదరాబాద్ ఈవెంట్ల టికెట్ల అమ్మకాలు, స్పాన్సర్ల నుంచి సేకరించినవని ఈవెంట్ నిర్వాహకుడు చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 19న దత్తా ఇంట్లో సోదాలు నిర్వహించిన అధికారులు పలు దస్త్రాలను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే.

**మంత్రి అత్యుత్సాహంతోనే..**

మెస్సి కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియానికి వచ్చినప్పటి నుంచి ఆ రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి అరూప్ బిస్వాస్ అతడితోనే సన్నిహితంగా మెలిగాడు. మెస్సి నడుముపై చేయి వేసి ఫొటోలకు పోజులిచ్చిన వీడియోలు వైరల్‌గా మారాయి. అంతేకాదు పలుకుబడి ఉపయోగించి ఆయన కుటుంబ సభ్యులు, పరిచయస్తులను మెస్సి దగ్గరకు తీసుకువచ్చినట్లు తెలిసింది. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో అరూప్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

# గుడ్డుపై అపోహలు.. చెక్ పెట్టిన FSSAI



గుడ్డు గురించి కొన్ని రోజులుగా పలు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. గుడ్లను క్యాన్సర్ ముప్పునకు ముడిపెడుతూ నెట్టింట్లో పోస్టులు దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్పందించింది. అవన్నీ తప్పుదోవపట్టించే వార్తలని స్పష్టం చేసింది. దేశంలో లభ్యమవుతోన్న గుడ్లు సురక్షితమైనవని శనివారం ప్రకటన విడుదల చేసింది. వాటిల్లో క్యాన్సర్ కారక పదార్థాలు ఉన్నాయని చెప్పేందుకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని పేర్కొంది. భారత్‌లో విక్రయించే గుడ్లలో నైట్రోఫ్యూరాన్ మెటబాలైట్స్‌ను గుర్తించినట్లు కొన్నిరోజులుగా పలు పోస్టులు వెలుగులోకి వచ్చాయి. 2011లో తీసుకువచ్చిన ఆహార భద్రత నిబంధలన ప్రకారం.. పౌల్ట్రీ, ఎగ్ ప్రొడక్షన్ జరిగే అన్ని దశల్లో నైట్రోఫ్యూరాన్ల వాడకాన్ని పూర్తిగా నిషేధించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు వెల్లడించారు. భారతదేశంలో నియంత్రణా ప్రమాణాలు అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఉన్నాయని పేర్కొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నీరుగారుస్తోంది సోనియా గాంధీ



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ పథకాన్ని బలహీనపరిచేందుకు మోదీ ప్రభుత్వం దశాబ్ది కాలంగా అనేక ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. ఇటీవల ఈ చట్టంలో ఏకపక్షంగా మార్పులు చేయడంతోపాటు దేశంలో కోట్లాది మంది రైతులు, కార్మికులు, భూమిలేని వారి ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వం దాడి చేసిందన్నారు. ఈ మేరకు సోనియా గాంధీ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. 20 ఏళ్ల క్రితం మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పథకాన్ని పార్లమెంటు ఏకాభిప్రాయంతో ఆమోదించిన విషయాన్ని సోనియా గాంధీ గుర్తుచేశారు. అదో విప్లవాత్మకమైన అడుగు అని.. అత్యంత పేదలు, అణగారిన వారి జీవితాలకు ఉపాధి మార్గంగా నిలిచిందన్నారు. వలసలు ఆగిపోవడమే కాకుండా, ఉపాధికి హామీ ఇచ్చిందన్నారు. మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు అనుగుణంగా తీసుకొచ్చిన ఆ పథకాన్ని మోదీ ప్రభుత్వం అణచివేసిందని ఆరోపించారు. గడిచిన 11 ఏళ్లుగా గ్రామీణ పేదల ప్రయోజనాలను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం.. మహాత్ముడి పేరు తొలగించడమే కాకుండా పథకం స్వరూపాన్నే మార్చిందని సోనియా గాంధీ దుయ్యబట్టారు. ఎటువంటి చర్చ లేకుండా, ఎవర్నీ సంప్రదించకుండా, విపక్షాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా చట్టాన్ని మార్చివేయడం దారుణమన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాడేందుకు లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని సోనియా గాంధీ పేర్కొన్నారు.

## చొరబాటుదారులను కాపాడేందుకే..

# సర్‌పై టీఎంసీ వ్యతిరేకత: ప్రధాని



ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని అధికార టీఎంసీ పార్టీ బెంగాల్‌లోని చొరబాటుదారులను కాపాడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. అందువల్లే రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తోందన్నారు. మమత పాలనలో బెంగాల్లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయన్నారు. ఇటువంటి 'మహా జంగిల్ రాజ్'కు తగిన బుద్ధి చెప్పాలంటే డబుల్ ఇంజిన్ ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని కోరారు. బెంగాల్‌లోని తాహెర్‌పుర్ ర్యాలీలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని మోదీ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ నేతలు తనను, భాజపాను ఎంత వ్యతిరేకించినప్పటికీ బెంగాల్ అభివృద్ధిని మాత్రం తాము ఎప్పుడూ ఆపబోమని మోదీ అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులను మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. మమత పాలనలో ఉద్రిక్తతలు, అల్లర్లు, బెదిరింపులతో విసిగిపోయిన ప్రజలు భాజపా వైపు చూస్తున్నారని అన్నారు. బిహార్ ఎన్నికల ఫలితం బెంగాల్ ఎన్నికల్లో తమ విజయానికి బాటలు వేస్తుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.

## శక్తిమంతమైన దేశమైనా సరే..

# తమ ఇష్టాలను ఇతరులపై రుద్దొద్దు: జైశంకర్




శక్తిమంతమైన దేశమైనా సరే తన ఇష్టాలను ఇతరులపై రుద్దడం సరికాదని విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ స్పష్టం చేశారు. ప్రపంచీకరణ మన ఆలోచన, పనివిధానాల్లో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందన్నారు. శనివారం మహారాష్ట్ర పుణెలోని సింబయోసిస్ ఇంటర్నేషనల్ (డీమ్డ్ యూనివర్సిటీ)లో జరిగిన స్నాతకోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, అనేక అధికార కేంద్రాలు ఉద్భవించాయని మంత్రి పేర్కొన్నారు. ''అధికారం అనేదానికి ఎన్నో అర్థాలు ఉంటాయి. వాణిజ్యం, మిలిటరీ, ఇంధనం, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా ఇవి మారుతుంటాయి. ఈ అధికారం ఏ ఒక్కదేశానికి పరిమితం కాదు. ఈ విషయాన్ని గ్లోబల్ పవర్స్ గుర్తించాల్సిన అవసరం ఉంది. ఎంత శక్తిమంతమైన దేశమైనా సరే.. తన ఇష్టాలను ఇతరులపై రుద్దలేదు. అంతేకాకుండా ప్రపంచ దేశాల మధ్య సహజమైన పోటీ ఉంది'' అని మంత్రి పేర్కొన్నారు. ఇక భారత్ వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలు తయారీ రంగంలో దూసుకెళ్లాల్సిన ఆవశ్యకతను గుర్తుచేశారు. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం భారత్ అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయి. ఇరు పక్షాల మధ్య చర్చలు జరుగుతుండగానే భారత వస్తువులపై టారిఫ్‌ను రెట్టింపు చేసి 50 శాతానికి ట్రంప్ చేర్చిన సంగతి తెలిసిందే. అమెరికా నుంచి వచ్చే వ్యవసాయ దిగుమతులపై భారత్ పన్నులు తగ్గించాలని అగ్రరాజ్యం కోరుతోంది. అందుకు ఇండియా ఒప్పుకోవడం లేదు. ఆ నేపథ్యంలోనే టారిఫ్‌లను ట్రంప్ ఆయుధంగా వాడుకుంటున్నారు.

# బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో మాజీ అగ్నివీరుల కోటా పెంపు



దిల్లీ: సరిహద్దు భద్రతా దళం నియామకాల్లో నిబంధనలను సవరిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. బీఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల నియామకాల్లో గతంలో 10 శాతంగా ఉన్న మాజీ అగ్నివీరుల కోటాను 50 శాతానికి పెంచినట్లు వెల్లడించింది. మొదటి దశలో మాజీ అగ్నివీరులకు కేటాయించిన 50 శాతం ఖాళీలకు, రెండో దశలో మాజీ అగ్నివీరులు కాకుండా మిగిలిన ఖాళీలకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నియామకాలు చేపడతామని నోటిఫికేషన్‌లో పేర్కొంది. రెండు దశల్లోనూ మాజీ సైనికులకు 10 శాతం కోటా కొనసాగుతుంది. తొలి బ్యాచ్ అగ్నివీరులకు 5 ఏళ్లు, మిగిలిన అగ్నివీరులకు 3 ఏళ్ల వరకు వయోపరిమితి విషయంలో సడలింపు ఉంటుంది. త్రివిధ దళాల్లో నియామకాలకు సంబంధించి జూన్ 2022లో కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అగ్నివీరులుగా వారి నాలుగేళ్ల సర్వీస్ ముగిసిన అనంతరం రిజర్వేషన్ ద్వారా కేంద్ర పారామిలటరీ బలగాల్లో నియమించుకుంటున్నారు. ఇందులో భాగంగానే గతంలో అన్ని కేంద్ర సాయుధ పోలీసు దళాలలోని కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) ఖాళీలలో 10 శాతం కోటా మాజీ అగ్నివీరులకు కేటాయించారు. తాజా నోటిఫికేషన్‌లో ఇతర కేంద్ర పారామిలటరీ దళాల్లో కాకుండా కేవలం బీఎస్ఎఫ్ నియామకాల్లో మాత్రమే అగ్నివీరుల కోటాను 10నుంచి 50 శాతానికి పెంచారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, మాజీ అగ్నివీరులకు శారీరక సామర్థ్య పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వగా.. రాత పరీక్షలో వారు ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది.

# ఈ నెల 26 నుంచి పరిహారం..

**ఇండిగో కీలక ప్రకటన**

**విమానాల రద్దుతో ఇబ్బందిపడ్డ ప్రయాణికులకు ఇండిగో పరిహారం**

**అదనంగా రూ.10,000 ట్రావెల్ వోచర్**

**ఈ నెల 26 నుంచి పరిహారం చెల్లింపులు ప్రారంభం**

**పరిహారం ప్రక్రియను పర్యవేక్షించనున్న కేంద్ర విమానయాన శాఖ**




**న్యూఢిల్లీ:** ఇటీవల విమానాలను భారీగా రద్దు చేసి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఇండిగో ఎయిర్‌లైన్స్, వారికి పరిహారం చెల్లించేందుకు ముందుకొచ్చింది. ఈ నెల 3, 4, 5 తేదీల్లో విమానాశ్రయాల్లో గంటల తరబడి చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఈ నెల 26 నుంచి రూ.10,000 విలువైన ట్రావెల్ వోచర్లను జారీ చేయనుంది.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన రూ.5,000 నుంచి రూ.10,000 పరిహారానికి ఇది అదనం. విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ సిన్హా అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అర్హులైన ప్రయాణికులందరికీ తక్షణమే చెల్లింపులు జరిగేలా చూడాలని ఇండిగోను ప్రభుత్వం ఆదేశించింది.

నేరుగా ఇండిగో వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకున్న వారికి వారం రోజుల్లోగా చెల్లింపులు ప్రారంభించాలని సమావేశంలో నిర్ణయించారు. ట్రావెల్ ఏజెంట్లు, ఆన్‌లైన్ పోర్టళ్ల నుంచి ప్రయాణికుల వివరాలు సేకరించి, వారికి కూడా నేరుగా పరిహారం అందించాలని ఇండిగోకు సూచించారు. ఈ ప్రక్రియను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఎయిర్ సేవా పోర్టల్ ద్వారా విమానయాన శాఖ పర్యవేక్షించనుంది.

రద్దయిన విమానాలకు సంబంధించి ఇండిగో రిఫండ్లు ప్రారంభించినప్పటికీ, ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీల ద్వారా బుక్ చేసుకున్న చాలా మందికి ఇంకా డబ్బులు అందలేదని తెలుస్తోంది. డీజీసీఏ ఆదేశాలతో మేక్ మై ట్రిప్ సంస్థ ఇండిగో నుంచి డబ్బులు రాకముందే దాదాపు రూ.10 కోట్లు రిఫండ్ చేసినట్లు సమాచారం. మరోవైపు భవిష్యత్తులో ఇలాంటి భారీ వైఫల్యాలు పునరావృతం కాకుండా సమస్య మూలాలను గుర్తించడానికి బయటి సాంకేతిక నిపుణులతో కలిసి పనిచేస్తామని ఇండిగో ఛైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా తెలిపారు.

ఈ నెల 8 నుంచి తమ నెట్‌వర్క్‌లోని అన్ని గమ్యస్థానాలకు విమాన సేవలు పూర్తిగా పునరుద్ధరించామని, 9 నుంచి కార్యకలాపాలు సాధారణ స్థితికి వచ్చాయని కంపెనీ పేర్కొంది.

## స్టార్‌బక్స్ సీటీఓగా భారత సీనియర్ టెకీ




**న్యూఢిల్లీ:** ప్రముఖ కాఫీ దిగ్గజ సంస్థ స్టార్‌బక్స్ తమ కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా భారతీయ సీనియర్ టెకీ ఆనంద్ వరదరాజన్‌ను నియమించింది. కస్టమర్లకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు స్టార్‌బాక్స్‌లో సాంకేతికతను పెంచాలనే సీఈవో బ్రియాన్ నికోల్ ప్రయత్నాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

సీటీఓగా డెబ్ హాల్ లెఫెవ్రే సెప్టెంబరులో పదవీవిరమణ చేశారు. ఆయన స్థానంలోకి తాజాగా ఆనంద్ వచ్చారు. కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు, సీటీఓగా ఆనంద్ విధులు నిర్వహించనున్నట్లు సీఈవో బ్రియాన్ ప్రకటించారు. ఆనంద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేశారు. ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఆనంద్ వరదరాజన్ తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత 19 ఏళ్ల పాటు అమెజాన్‌లో విధులు నిర్వర్తించారు. ఒరాకిల్‌తో సహా పలు స్టార్టప్ కంపెనీల్లో కూడా పనిచేశారు.

## ఘోస్ట్ పెయిరింగ్.. వాట్సప్‌లో ఈ మెసేజ్ వచ్చిందా?



**న్యూఢిల్లీ:** ఈ టెక్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త పంథాలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో వాట్సప్ యూజర్లే లక్ష్యంగా కొత్త తరహా మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. డివైజ్ లింకింగ్ ఫీచర్‌ను దుర్వినియోగం చేసి, యూజర్ ఖాతాల్లోకి చొరబడుతున్నారు. దీనిని టెక్ నిపుణులు ఘోస్ట్ పెయిరింగ్ అని పిలుస్తున్నారు. పాస్‌వర్డ్స్, వెరిఫికేషన్ కోడ్స్, సిమ్ కార్డ్స్ వివరాలు చోరీ చేయాల్సిన పని లేకుండానే స్కామర్లు తమ పని కానిస్తున్నారని హెచ్చరించారు.

ఈ ఘోస్ట్ పెయిరింగ్‌లో సోషల్ ఇంజినీరింగ్‌ది కీలక పాత్ర. దానిద్వారా యూజర్ వాట్సప్.. మోసపూరిత డివైజ్‌తో అనుసంధానం అయ్యేలా స్కామర్లు బురిడీ కొట్టిస్తుంటారు . ఈ మోసాన్ని గుర్తించడం కష్టం. మనకు తెలిసిన కాంటాక్ట్‌ల నుంచి వంటి సందేశంతో ఈ స్కామ్ మొదలవుతుంది. సందేశంలో అంతర్లీనంగా లింక్ ఉంటుంది. ఆ తర్వాత ఫేస్‌బుక్ ఫొటో వ్యూయర్ తలపించే నకిలీ వెబ్‌పేజ్ డిస్‌ప్లే అవుతుంది. అందులోని కంటెంట్ చూడాలంటే తొలుత వెరిఫై చేయాల్సి ఉంటుంది. మనకు పైకి ఇలా కనిపిస్తున్నా.. అంతర్లీనంగా డివైజ్ పెయిరింగ్ ప్రక్రియ మొదలవుతుంది. అప్పుడే ఫోన్ నంబర్ ఎంటర్ చేయాలని యూజర్‌కు రిక్వెస్ట్ వస్తుంది.

### మీ ఖాతా ఎవరు వాడుతున్నారు?

దాని తర్వాత న్యూమరిక్ పెయిరింగ్ కోడ్‌ను వాట్సప్ జనరేట్ చేస్తుంది. ఈ కోడ్‌ను వాట్సప్ లో ఎంటర్ చేయాలని నకిలీ పేజ్‌లో ఒక సూచన కనిపిస్తుంది. ఇదంతా భద్రతా తనిఖీల్లో భాగమని పేర్కొంటుంది. ఇక ఈ కోడ్‌ను ఎంటర్ చేయగానే మనకు తెలియకుండానే స్కామర్ డివైజ్‌తో అనుసంధానం అవుతాం. దీంతో వాట్సప్ వెబ్ యాక్సెస్ మొత్తం హ్యాకర్ చేతిలోకి వెళ్లిపోతుంది. బాధితుడి మెసేజ్‌లు అన్నీ చదివేస్తాడు. యూజర్ పంపినట్టుగా ఇతరులకు సందేశాలు పంపుతాడు. ఈ ఉల్లంఘన అంతా తెలియకుండానే జరిగిపోతుంటుంది.

ఈ ఘోస్ట్ పెయిరింగ్‌ను తొలుత చెక్ రిపబ్లిక్‌లో గుర్తించారు. ఇది ఇక్కడితో ఆగకపోవచ్చని నిపుణులు హెచ్చరించారు. ఇప్పటికే హ్యాకర్ల చేతిలో చిక్కిన ఖాతాలను ఉపయోగించి, కాంటాక్ట్‌లు, గ్రూప్ చాట్‌లకు ఆ మోసపూరిత లింక్‌లను పంపే అవకాశం ఉందని పేర్కొన్నారు. లింక్డ్ డివైజ్‌ను యూజర్ మాన్యువల్‌గా తొలగించేవరకు అది యాక్టివ్‌గానే ఉంటుంది. యూజర్ దానిని గుర్తించేవరకు ఉల్లంఘనకు గురవుతూనే ఉంటారు. ఘోస్ట్ పెయిరింగ్ వంటి కేసుల్లో సాఫ్ట్‌వేర్ లోపాల కంటే మనుషుల విశ్వాసం, భయం, అవసరం వంటి మానసిక ప్రవర్తనను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడతారని నిపుణులు హెచ్చరించారు. ఇందుకోసం మనుషుల ప్రవర్తనను స్కామర్లు అర్థం చేసుకుంటారు. దానిద్వారా యూజర్ రహస్య సమాచారాన్ని బహిర్గతం చేసేలా మభ్యపెడతారు. దీనినే సోషల్ ఇంజినీరింగ్‌గా చెప్తారు.




# టీ20 ప్రపంచకప్‌కు జట్టును ప్రకటించిన బీసీసీఐ..!

**ఐసీసీ ఈవెంట్ నుంచి శుభ్‌మన్ గిల్ అవుట్..!**

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది భారత్-శ్రీలంక వేదికగా జరుగనున్న టీ20 ప్రపంచకప్‌లో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని టీమిండియా డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలో దిగనున్నది. ఈ సారి టైటిల్‌ను నిలబెట్టుకోవాలని భారత జట్టు భావిస్తున్నది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని జాతీయ సెలక్షన్ కమిటీ శనివారం టీ20 ప్రపంచ టోర్నమెంట్ కోసం 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రధాన కార్యాలయంలో జరిగిన సెలక్షన్ కమిటీ సమావేశంలో జట్టును ఎంపిక చేసింది. ఇదే జట్టు జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌లో కూడా ఆడనుంది.

రోహిత్ శర్మ కెప్టెన్సీలో భారత్ 2024లో దక్షిణాఫ్రికాను ఓడించి ట్రోఫీని గెలుచుకుంది. భారత్ తన టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే సంకల్పంతో ఈ టోర్నమెంట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నది. ఈ ఇది టోర్నమెంట్ 10వ ఎడిషన్. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటి వరకు ఏ జట్టు కూడా టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయాయి. సొంత గడ్డపై ఈ రికార్డును బద్దలు కొట్టాలని టీమిండియా కృతనిశ్చయంతో ఉన్నది. టీ20 ప్రపంచ కప్ కోసం భారత జట్టులో శుభ్‌మన్ గిల్ దూరమయ్యాడు. మొన్నటి వరకు వైస్ కెప్టెన్‌గా కొనసాగిన గిల్ స్థానంలో అక్షర్ పటేల్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఫామ్ లేమితో గిల్ ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే.

ఇదిలా ఉండగా.. వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్, రింకు సింగ్ జట్టులోకి తిరిగి వచ్చారు. ఇషాన్ చివరిగా 2023 నవంబర్ 28న ఆస్ట్రేలియాపై భారత్ తరఫున చివరి మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత ఇషాన్ దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపికయ్యాడు. కానీ అక్కడ ఒక్క మ్యాచ్ కూడా ఆడే ఛాన్స్ రాలేదు. పర్యటన మధ్యలోనే ఇషాన్ తిరిగి స్వదేశానికి వచ్చాడు. దేశవాళీ క్రికెట్ కంటే ఐపీఎల్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాడన్న విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే జాతీయ జట్టులో చోటు కోల్పోయాడు. తాజాగా రెండేళ్ల తర్వాత జట్టులోకి తిరిగి వచ్చాడు. రింకు సింగ్ చివరిసారిగా ఆసియా కప్‌లో ఆడాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో మాత్రం చోటు దక్కలేదు. శుభ్‌మన్ గిల్ స్థానంలో అక్షర్ పటేల్‌ను టీ20 జట్టు వైస్ కెప్టెన్‌గా నియమించారు. అక్షర్ గతంలో కూడా టీ20ల్లో వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

వాస్తవానికి ఈ సారి ఎవరూ ఊహించని విధంగా ఇషాన్ కిషన్ జట్టులోకి తిరిగి వచ్చాడు. కిషన్ ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఫైనల్‌లో 101 పరుగులు చేశాడు. టోర్నమెంట్ మొత్తం అద్భుతమైన బ్యాటింగ్‌తో అలరించాడు. ఇషాన్ చేరికతో జితేష్ శర్మ చోటు కోల్పోయాడు. సంజు శాంసన్ వికెట్ కీపర్‌గా వ్యవహరిస్తాడు. జట్టును ప్రకటించే సమయంలో అజిత్ అగార్కర్ మాట్లాడుతూ సంజు శాంసన్ వికెట్ కీపర్‌గా కొనసాగుతాడని తెలిపాడు. గిల్ జట్టులో లేకపోవడంతో అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. శాంసన్, అభిషేక్ ఓపెనింగ్ జోడీ అద్భుతంగా ఉంటుంది. గతంలో ఇద్దరు ఓపెనర్లుగా వచ్చి పరుగుల వరద పారించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదవ టీ20లోనూ ఇదే దృష్యం కనిపించింది.

ఈ ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచకప్ జరుగనున్నది. భారత్-శ్రీలంక సంయుక్తంగా టీ20 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇస్తున్నాయి. ఇప్పటికే ఐసీసీ వేదికలను ఖరారు చేసిన విషయం తెలిసిందే. టీమిండియా టీ20 ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న ముంబయిలో యూఎస్‌ఏతో ఆడుతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 12న నమీబియాతో ఢిల్లీలో ఆడుతుంది. ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడుతుంది. అనంతరం ఫిబ్రవరి 18న అహ్మదాబాద్‌లోని భారీ నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో చివరి గ్రూప్ మ్యాచ్ ఆడుతుంది.

### టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టు

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకూ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, ఇషాన్ కిషన్, వరుణ్ చక్రవర్తి.

## అడిలైడ్‌లో తిప్పేసిన లియాన్.. ఇంగ్లండ్ బ్యాటర్లు అద్భుతం చేస్తారా..!

**అడిలైడ్:** యాషెస్ సిరీస్ సమం చేయాలనుకున్న ఇంగ్లండ్ ఇక ఆశలు వదులుకోవాల్సిందే. రెండు టెస్టుల్లో ఆస్ట్రేలియాకు కనీసం పోటీ ఇవ్వలేకపోయిన ఇంగ్లిష్ టీమ్.. అడిలైడ్‌లోనూ అదే తడబాటుతో ఓటమి అంచున నిలిచింది. ట్రావిస్ హెడ్(170) భారీ శతకంతో పుంజుకున్న ఆసీస్ నాలుగో రోజు కమిన్స్(3-24), నాథన్ లియాన్(3-64)ల విజృంభణతో గెలుపు దిశగా సాగుతోంది. వీరిద్దరి ధాటికి ఇంగ్లండ్ టాపార్డర్ కుప్పకూలగా.. జేమీ స్మిత్(2 నాటౌట్), విల్ జాక్స్(11 నాటౌట్) పోరాడుతున్నారు. ఆఖరి సెషన్‌లో వీరిద్దరూ పట్టుదలగా ఆడడంతో ఆట ముగిసే సరికి 6 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది.



ఆస్ట్రేలియా గడ్డపై యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ మరో ఓటమికి చేరువలో ఉంది. ఇప్పటికే పెర్త్, బ్రిస్బేన్‌లో కంగుతిన్న పర్యాటక జట్టు చావోరేవో పోరులోనూ ఎదురీదుతోంది. అడిలైడ్ టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో జాక్ క్రాలే(85) అర్ధ శతకంతో ఆశలు రేపినా.. కమిన్స్ (3-24), నాథన్ లియాన్(3-64) వికెట్ల వేటకు టాపార్డర్ కుప్పకూలింది. కమిన్స్ ఓవర్లో జో రూట్(39), లియన్ దెబ్బకు హ్యారీ బ్రూక్(30)లు తేలిపోయారు. స్వల్ప తేడాతో బ్రూక్‌ను, బెన్‌స్టోక్స్(5)ను బౌల్డ్ చేసిన లియాన్ ఇంగ్లండ్‌ను విజయావకాశాల్ని దెబ్బతీశాడు.

అర్ధ శతకంతో పోరాడిన క్రాలేను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఓటమి అంచున నిలిపాడు లియాన్. ఆఖరి సెషన్‌లో జేమీ స్మిత్(2 నాటౌట్), విల్ జాక్స్(11 నాటౌట్)లు వికెట్ కాపాడుకోవడంతో ఆట ముగిసే సరికి 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. యాషెస్ సిరీస్ సమం చేయాలంటే ఇంగ్లండ్ విజయానికి 228 రన్స్ అవసరం. కానీ, చివరి రోజు వీరిద్దరూ సెంచరీలు సాధిస్తే తప్ప గెలుపు అసాధ్యం. ఒకవేళ తొలి సెషన్‌లోనే ఔటయ్యారంటే.. టెయిలెండర్లను కమిన్స్, లియాన్ చుట్టేయడం పక్కా. తొలి ఇన్నింగ్స్‌లో జోఫ్రా ఆర్చర్(5-53) చెలరేగగా ఆసీస్‌ను 371కే కట్టడి చేసిన ఇంగ్లండ్ బ్యాటర్ల వైఫల్యంతో మ్యాచ్‌పై పట్టు సాధించలేకపోయింది.

## సూర్యకుమార్‌కు మద్దతు ప్రకటించిన తిలక్ వర్మ..

**ఫామ్‌లోకి వచ్చేందుకు ఒక ఇన్నింగ్స్ సరిపోతుందన్న బ్యాట్స్‌మెన్..!**



**న్యూఢిల్లీ:** టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పేలవ ఫామ్‌తో పరుగులు చేసేందుకు ఇబ్బందిపడుతున్నాడు. దాంతో టీమిండియా కెప్టెన్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే, సూర్యకు టీమిండియా యువ ఆటగాడు తిలక్ వర్మ మద్దతు ప్రకటించాడు. తిరిగి ఫామ్‌లోకి వచ్చేందుకు కెప్టెన్‌కు కేవలం ఒకే ఇన్నింగ్ సరిపోతుందని తెలిపాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో సూర్య భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోయాడు. వచ్చే ఏడాదిలో టీ20 ప్రపంచకప్ జరుగనున్నది. మెగా ఈవెంట్‌కు ముందు కెప్టెన్ ఫామ్‌లో లేకపోవడంతో ఆందోళనకు గురి చేస్తున్నది. సూర్యకుమార్ చాలాకాలంగా పరుగులు చేయలేకపోతున్నాడు. భారత జట్టు దక్షిణాఫ్రికాను 3-1 తేడాతో ఓడించి సిరీస్‌ను కైవసం చేసుకుంది.

టీ20 ప్రపంచ కప్ కోసం భారత జట్టును కూడా శనివారం బీసీసీఐ ప్రకటించనున్నది. సౌతాఫ్రికాతో జరిగిన చివరి టీ20 అనంతరం సూర్య కుమార్ గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ.. కొన్ని బంతులను సౌకర్యవంతంగా ఆడాలని సూర్యకు సూచించినట్లు తెలిపాడు. కొద్దిగా వేచి ఉండాలని.. అతను క్రీజులో కొంత వరకు సమయం గడపాలన్న తిలక్.. సూర్యకుమార్ తిరిగి ఆత్మవిశ్వాసంతో ఆడితే ఎంత ప్రమాదకరమైన ఆటగాడో అందరికీ తెలిసిందేనన్నాడు. బ్యాటింగ్ సమయంలో కొన్ని బంతులను ఎదుర్కొంటే ఫీల్డర్ల మీదుగా కొన్ని షాట్లు కొట్టేందుకు ప్రయత్నించాలని చెప్పానని.. గ్యాప్స్‌లో ఆడేందుకు ప్రయత్నించాలని సూచించినట్లు చెప్పాడు. ఎవరైనా బ్యాట్స్‌మెన్ అలా చేయగలిగితో వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని.. ఫీల్డ్ గురించి అవగాహన వస్తుందని.. ఆ తర్వాత భారీ షాట్లు ఆడవచ్చని తిలక్ వర్మ చెప్పాడు.

# యూఎస్ కిడ్స్ గోల్ఫ్ టోర్నీలో సత్తా చాటిన భారత చిన్నారులు

**యూఎస్ కిడ్స్ గోల్ఫ్ ఇండియా ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన యువ గోల్ఫర్లు**

**నిహాల్ చీమా, ద్రోణ సింగ్, నాయ్షా సిన్హా అద్భుత ప్రదర్శన**

**విజేతలకు తొలిసారిగా నగదు బహుమతుల అందజేత**

**భవిష్యత్తులో ఆసియా ఛాంపియన్‌షిప్ నిర్వహణకు ప్రణాళికలు**



**న్యూఢిల్లీ:** క్లాసిక్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్ వేదికగా జరిగిన ఐదవ యూఎస్ కిడ్స్ గోల్ఫ్ ఇండియన్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ గోల్ఫర్లు సత్తా చాటారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పొగమంచు వంటి సవాళ్లను అధిగమించి నిహాల్ చీమా, ద్రోణ సింగ్ ధుల్, ప్రిన్స్ బెయిన్స్‌లా, నాయ్షా ఎస్ సిన్హా, గైరత్ కౌర్ కహ్లోన్, శిక్షా జైన్ వంటి క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు.

వాతావరణం అనుకూలించకపోవడం, ఆలస్యంగా ప్రారంభం కావడంతో టోర్నమెంట్ కమిటీ చివరి రౌండ్‌ను అన్ని విభాగాలకు 9 హెూల్స్‌కు కుదించింది. బాలుర 8 ఏళ్ల విభాగంలో నిహాల్ చీమా మూడు రోజులూ అద్భుతంగా ఆడి తిరుగులేని విజయాన్ని అందుకున్నాడు. హర్యానాకు చెందిన ద్రోణ సింగ్ ధుల్ (బాలుర 11 ఏళ్ల విభాగం) చివరి రౌండ్‌లో 4-అండర్ 32 స్కోర్‌తో ఆకట్టుకున్నాడు. ప్రిన్స్ బెయిన్స్‌లా (బాలుర 15-18 ఏళ్ల విభాగం) తొలిరోజు 6-అండర్ 66 స్కోర్‌తో సత్తా చాటి విజేతగా నిలిచాడు.

బాలికల విభాగంలో ఆన్యా దండ్రియాల్ (11-12 ఏళ్లు) టై బ్రేకర్‌లో విజయం సాధించగా, నాయ్షా ఎస్ సిన్హా (8 ఏళ్లు), శిక్షా జైన్ (13-14 ఏళ్లు) తమ తమ విభాగాల్లో అద్భుత ప్రదర్శన చేశారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో తొలిసారిగా విజేతలకు నగదు బహుమతులు అందించారు. విజేతలకు రూ. 25,000, రెండు, మూడు స్థానాల్లో నిలిచిన వారికి చెరో రూ. 10,000 అందజేశారు.

"పిల్లలను ఛాంపియన్‌లుగా తీర్చిదిద్దడానికి ఎంతో శ్రమించే క్రీడాకారులు, వారి కుటుంబాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నగదు బహుమతులు ప్రవేశపెట్టాం" అని యూఎస్ కిడ్స్ గోల్ఫ్ ఇండియా వ్యవస్థాపకుడు రాజేశ్ శ్రీవాస్తవ తెలిపారు. భవిష్యత్తులో విదేశీ కోచ్‌లను రప్పించడం, మన పిల్లలను శిక్షణ కోసం విదేశాలకు పంపడం వంటి ప్రణాళికలు ఉన్నాయని ఆయన వివరించారు. ఏడాదిలోగా ఆసియా దేశాలన్నింటికీ కలిపి ఒక ఏషియన్ ఛాంపియన్‌షిప్ నిర్వహించే యోచనలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

MOVIE TIME

# ఆనాటి ఘటనలు తలచుకుంటేనే భయమేస్తోంది

## నటి రాధికా ఆప్టే సంచలన వ్యాఖ్యలు



టాకీస్: బాలీవుడ్‌తో పాటు సౌత్ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రాధికా ఆప్టే. సినీ రంగంలో తన ఇరవై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న వివక్ష అలాగే బాడీ షేమింగ్ గురించి ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆ రోజులు గుర్తుకు వస్తే ఇప్పటికీ తన గుండె ఆగిపోయినంత పని అవుతుందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 2000వ దశకం చివరలో ఆర్థిక ఇబ్బందుల వల్ల కొన్ని దక్షిణాది సినిమాల్లో నటించాల్సి వచ్చిందని, అప్పుడు షూటింగ్ సెట్స్‌పై ఉన్న పరిస్థితులు అత్యంత దారుణంగా ఉండేవని ఆమె పేర్కొన్నారు. ఒక చిన్న ఊరిలో జరిగిన షూటింగ్ సమయంలో సెట్ అంతా మగవారే ఉండేవారని, అక్కడ తన శరీరాకృతి గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసేవారని రాధిక వెల్లడించారు. సెట్‌లో ఉన్నవాళ్లు నా బమ్స్ మరియు బ్రెస్ట్స్ దగ్గర ప్యాడింగ్ పెంచమని అడిగేవారు. 'అమ్మా.. మోర్ ప్యాడింగ్' అని పిలిచేవారు. ఆ మాటలు విన్నప్పుడు తనకు నవ్వాలో ఏడవాలో అర్థమయ్యేది కాదని రాధికా వాపోయింది. అప్పట్లో తనకు రక్షణగా మేనేజర్లు, ఏజెంట్లు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా ఆ మానసిక వేదనను అనుభవించానని, ఆ పరిస్థితులు తనను ఇప్పటికీ మానసిక గాయానికి గురిచేస్తాయని ఆవేదన చెందారు. హిందీ పరిశ్రమలో కూడా కొందరు ప్రభావవంతమైన వ్యక్తుల ప్రవర్తన నచ్చక తానంతట తానే పెద్ద ప్రాజెక్టుల నుంచి తప్పకున్నానని, ఒకవేళ వారి పేర్లు బయటపెడితే ప్రపంచమంతా షాక్ అవుతుందని ఆమె తెలిపింది. పరిశ్రమలో ఉన్నత స్థాయిలో ఉన్న మహిళలు కూడా వ్యవస్థను మార్చడానికి ప్రయత్నించకపోవడం విచారకరమని అభిప్రాయపడిన రాధికా ఆప్టే, ప్రస్తుతం తన తాజా చిత్రం 'సాలీ మొహబ్బత్' జీ5లో స్ట్రీమ్ అవుతున్న సందర్భంగా ఈ విషయాలను పంచుకుంది.



# నెట్‌ఫ్లిక్స్‌లోకి వస్తోన్న ఆంధ్రా కింగ్ తాలూకా

**టాకీస్:** రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'.. తెలుగు సినీ అభిమాని కథగా నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా విడుదలై నెల కూడా తిరక్కుండానే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 25 నుంచి తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. విషయాన్ని తెలుపుతూ నెట్‌ఫ్లిక్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. మహేశ్‌బాబు.పి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. సూర్య(ఉపేంద్ర) పేరుమోసిన సూపర్‌స్టార్. అశేషమైన అభిమానుల అతని సొంతం. అయితే.. తనకు బ్యాడ్ పిరియడ్ నడుస్తూ ఉంటుంది. విడుదలైన సినిమాలన్నీ ఎ÷-లాపులవుతుంటాయి. ఈ క్రమంలో సూర్య వందవ చిత్రం షూటింగ్ మధ్యలోనే ఆగిపోతుంది. చిత్రాన్ని నిర్మించలేనని నిర్మాత చేతులెత్తేస్తాడు. ఓ మూడు కోట్లు ఉంటే సినిమా పూర్తవుతుంది. ఆ మూడు కోట్ల కోసం సూర్య ప్రయత్నాలు మొదలుపెడతాడు. ఈ క్రమంలో ఓ నిర్మాతను డబ్బు అడుగుతాడు. అతను తన కొడుకు హీరోగా పరిచయం అవుతున్న సినిమాలో తండ్రి పాత్ర వేస్తే డబ్బు సర్దుతానంటాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా డబ్బు సమకూరకపోవడంతో చివరికి ఆ నిర్మాత పెట్టిన షరతుకి ఓకే చెప్పాలనుకుంటాడు. తన నిర్ణయాన్ని ఆ నిర్మాతకు చెప్పేలోపే సూర్య అకౌంట్‌లో మూడు కోట్లు పడతాయి. ఆ డబ్బు ఎవరు వేశారో సూర్యకు అర్థం కాదు. రాజమండ్రి దగ్గర్లోని ఓ పల్లెటూరి కుర్రాడు ఆ మూడు కోట్లు వేశాడని తెలిసి సూర్య షాక్ అవుతాడు. అతను తన అభిమాని తెలుసుకున్న సూర్య.. అతన్ని కలవాలని బయలు దేరతాడు? మరి సూర్య అభిమానిని కలిశాడా? ఓ పల్లెటూరి కుర్రాడికి ఈ మూడు కోట్లు ఎలా వచ్చాయి? అసలు ఆ కుర్రాడెవరు? అతని కథేంటి? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ.

# సామాజిక సందేశంతో వస్తోన్న దండోరా

**టాకీస్:** గ్రామీణ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రాలకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారన్న విషయం తెలిసిందే. తాజాగా అదే కోవలో తెలంగాణ సంస్కృతి, సామాజిక అంశాల కలబోతగా వస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో విడుదల చేస్తుండటం సినిమాపై మరింత అంచనాలను పెంచింది. విదేశాల్లో కూడా ఈ సినిమా భారీ ఎత్తున విడుదల కానుంది. సుమారు 200కు పైగా థియేటర్లలో ప్రదర్శితం కాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి, ఈ నెల 23నే అక్కడ ప్రీమియర్స్




పడనున్నాయి. అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా వారం కూడా లేకపోవడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.

గ్రామాల్లో ఇంకా కులం అడ్డుగోడలు తొలగిపోలేదని ఈ ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతుంది. ప్రారంభంలోనే ఊరి బయట శవాన్ని మోసుకెళ్తున్న దృశ్యాలు, 'మన చావు పుట్టుకలన్నీ ఈ ఊరి బయట రాసిండ్రా ఆ దేవుడు..' అనే డైలాగ్ ఈ సినిమాలో ఉన్న సామాజిక కోణాన్ని ఎత్తి చూపుతోంది. ఈ చిత్రంలో శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మానికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందుమాధవి, రాధ్య, అదితి భావరాజు వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషించారు.



# వెన్నులో వణుకు పుట్టించేలా ఈషా

టాకీస్: త్రిగుణ్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో రానున్న హారర్ థ్రిల్లర్ 'ఈషా'. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. ఆ హారర్ థ్రిల్లర్ డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో విడుదలకు ముందు ఆసక్తికరమైన వీడియోను టీమ్ పంచుకుంది. ఆత్మ అంటే అదేనేమో అంటూ హీరోయిన్ చెప్పే డైలాగు భయపెట్టేలా ఉంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' వంటి వరుస కల్ట్ హిట్స్ అందించిన సక్సెస్‌ఫుల్ జోడీ బన్నీ వాస్, వంశీ నందిపాటి. కలిసి ఇప్పుడు ప్రేక్షకులకు ఒక క్రేజీ హారర్ అనుభూతిని పంచడానికి సిద్ధమయ్యారు. వీరి సరికొత్త హారర్ థ్రిల్లర్ 'ఈషా' డిసెంబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ చిత్రం గురించి మేకర్స్ తాజాగా 'వార్నింగ్ వీడియో' పేరిట ఒక ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. సాధారణంగా హారర్ సినిమాలకు ట్రైలర్లు రావడం సహజం, కానీ ఇలా ప్రత్యేకంగా హెచ్చరిక వీడియో రావడం హారర్ జానర్‌లోనే ఇదే తొలిసారి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఆత్మలు, దెయ్యాలు లేవని బలంగా నమ్మే కొందరు స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలోని మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎండగట్టాలని వారు భావిస్తారు. ఈ క్రమంలో వారికి పృథ్వీరాజ్ (బబ్లూ) నుంచి ఒక సవాలు ఎదురవుతుంది. 'ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..?' అంటూ ఆయన విసిరే ఛాలెంజ్‌తో ఈ స్నేహితుల బృందం ఒక చీకటి ప్రపంచంలోకి అడుగుపెడుతుంది. మనుషుల్లాగే కొన్ని స్థలాలు కూడా పుట్టుకతోనే శాపగ్రస్తమై ఉంటాయి.. కాలక్రమేణా అవి ఆత్మలకు నిలయాలుగా మారుతాయని దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఇచ్చిన వార్నింగ్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. ట్రైలర్ మరియు ఈ వార్నింగ్ వీడియోలో కనిపించిన విజువల్స్ భయానకంగా ఉన్నాయి. ముఖ్యంగా పాడుబడిన బంగ్లా, క్షుద్ర పూజల సెటప్, బ్లూ అండ్ డార్క్ థీమ్ విజువల్స్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి.సంతోష్ లైటింగ్, ధృవన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాలోని భయాన్ని రెట్టింపు చేస్తున్నాయి. ఈ చిత్రంలో ఉండే సడన్ ట్విస్ట్‌లు చూసి భయపడే అవకాశం ఉన్నందున, గుండె బలహీనంగా ఉన్నవారు ఈ సినిమా చూడకూడదని చిత్ర బృందం స్పష్టం చేసింది. ఇందులో త్రిగుణ్, అఖిల్ రాజ్ హీరోలుగా నటించగా, హెబ్బా పటేల్ హీరోయిన్‌గా నటించింది.

# బిర్యానీ పాత్రలో సంపూర్ణేశ్ బాబు

**టాకీస్:** నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి ఒక షాకింగ్ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో 'బర్నింగ్ స్టార్' సంపూర్ణేష్ బాబును ఒక సరికొత్త ఊర మాస్ అవతారంలో శ్రీకాంత్ ఓదెల చూపించబోతున్నాడు. ఎప్పుడూ తనదైన కామెడీతో నవ్వించే సంపూర్ణేష్ బాబును దర్శకుడు శ్రీకాంత్ ఓదెల పూర్తిగా మార్చేశాడు. 'ది ప్యారడైజ్' చిత్రంలో సంపూ 'బిర్యానీ' అనే మాస్ పాత్రను పోషిస్తున్నారు. శుక్రవారం విడుదలైన ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పోస్టర్‌లో సంపూర్ణేష్ బాబు ఒంటి నిండా రక్తపు మరకలతో, భుజాన గొడ్డలి వేసుకుని, బీడీ తాగుతూ చాలా సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లలో కనిపిస్తున్న క్రూరత్వం చూస్తుంటే, ఇందులో ఆయన కేవలం కామెడీకి పరిమితం కాకుండా ఒక పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంలో హీరో నాని (జడల్) కి అత్యంత సన్నిహితుడైన స్నేహితుడిగా, ప్రాణమిచ్చే నమ్మకస్థుడిగా 'బిర్యానీ' పాత్ర ఉండబోతోంది. ఈ పాత్ర కోసం సంపూర్ణేష్ బాబు చాలా బరువు తగ్గి, తన బాడీ



లాంగ్వేజ్‌ను కూడా పూర్తిగా మార్చుకున్నట్లు చిత్ర బృందం తెలిపింది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన సినిమాల్లో పాత్రలను చాలా సహజంగా, గంభీరంగా చూపిస్తారు. 'దసరా'లో కమెడియన్లను కూడా సీరియస్ పాత్రల్లో చూపించినట్లుగానే, ఇప్పుడు సంపూ లోని యాక్షన్ యాంగిల్‌ను బయటకు తీయబోతున్నారు. 'హైదరాబాద్ నేపథ్యంలో సాగే కథలో 'బిర్యానీ' లేకుండా ఉండదు' అంటూ ఈ పాత్రను ఇంట్రడ్యూస్ చేసిన తీరు వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో నానితో పాటు, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ఈ సినిమా 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో (తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్) గ్రాండ్‌గా విడుదల కానుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.